# మనజనప్రగతి

జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక

సంపుటి : 6 సంచిక : 235 పేజీలు : 8 వెల : రూ.2/- శనివారం 19 సెప్టెంబర్ 2026 వైయస్ఆర్ కడప

Kadapa, Ananthapur, Chittor, Vishakapatanam, Srikakulam, Elluru, Thirupathi, Ongole, Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool


# పేదలకు పట్టాభిషేకం

**● ప్రభుత్వ స్థలాలు, కొండవాలు ప్రాంతాల్లోని నివాసితులకు హక్కు పత్రాలు పంపిణీ ● 23,2,83 మందికి కన్వేయన్స్ డీడ్లు, 5,162 మందికి పట్టాలు ● మొత్తం 399.474 ఎకరాలు....విలువ రూ. 8,874.27 కోట్లు ● అత్యధికంగా విశాఖ రూరల్ మండలంలో 9,261 మందికి లబ్ధి ● ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేతుల మీదుగా కార్యక్రమం**



**విశాఖపట్నం,మన జనప్రగతి సెప్టెంబర్ 18:** వేలాది మంది పేదలకు సొంతింటి కల సాకారం కానున్నది. జిల్లాలో ప్రభుత్వ స్థలాలు, కొండవాలు ప్రాంతాలు, తదితరచోట్ల నివాసాలు ఏర్పాటుచేసుకుని దశాబ్దాలుగా జీవనం సాగిస్తున్న వారికి వాటిపై హక్కు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఇందుకు ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల మైదానం వేదిక కానున్నది. శనివారం మధ్యాహ్నం రెండు గంటలకు 28,445 మందికి పట్టాలు, కన్వేయన్స్ డీడ్స్ (ఆస్తి యాజమాన్య బదిలీ పత్రం) పంపిణీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేతుల మీదుగా ప్రారంభం కానున్నది. మిగతా2లో...

## ప్రైవేట్ వర్సిటీలను లాభార్జన కోసం నిర్వహించకూడదు

**- ఆడిట్ ఖాతాలను సమర్పించాలని సుప్రీం కోర్టు ఆదేశం**



**న్యూఢిల్లీ మన జనప్రగతి సెప్టెంబర్ 18:** ప్రైవేట్ యూనివర్సిటీలను లాభం కోసం నిర్వహించ కూడదని సుప్రీం కోర్టు గురువారం తెలిపింది. ప్రజల విద్యా లక్ష్యాలను పూర్తి చేసే ఉద్దేశం వాటికి ఉండాలని పేర్కొంది. కేవలం లాభాలు సంపాదించుకొనే వ్యాపారంలా విద్యను చూసే సంస్థలను అనుమతించొద్దని ప్రభుత్వాలను కోరింది. అన్ని విశ్వవిద్యాలయాల ఆడిట్ చేసిన ఖాతాలను ఆరు వారాల్లోగా తమకు సమర్పిం చాలని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ను ఆదేశించింది. ఆ ఖాతా ల్లో మిగులు ఆదా యం, వ్యయం, వసూలు చేసిన రుసుముల వివరాలు ఉండాలని స్పష్టం చేసింది. అమిటీ యూనివర్సిటీ కాలేజీ రికార్డుల్లో తన పేరు మార్చుకోవాలని ప్రయత్నించిన ఓ విద్యార్థిని తనను యాజ మాన్యం వేధించిందని దాఖలు చేసిన కేసులో కోర్టు ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది.

## డిజిటల్ వ్యవసాయంలో ఏపీ ముందంజ

**- మంత్రి అచ్చెన్నాయుడు**




**హైదరాబాద్, మన జనప్రగతి సెప్టెంబర్ 18:-** సాంకేతికతను వ్యవసాయ రంగానికి అనుసంధా నిస్తూ సాగు వ్యయాన్ని తగ్గించి రైతుల ఆదాయం పెంచే దిశగా ఆంధ్రప్రదేశ్‌లో పలు సంస్కరణలు అమలు చేస్తున్నామని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. హైదరాబాద్‌లో జరిగిన సౌత్ స్టేట్స్ వ్యవసాయ మంత్రుల సదస్సులో రాష్ట్రంలో అమలు చేస్తున్న కార్యక్రమాలను వివరించారు. రాష్ట్రంలోని 52.08 లక్షల మంది రైతులకు ఫార్మర్ ఐడీలు జారీ చేసి అగ్రిస్టాక్‌లో 86.8 శాతం లక్ష్యాన్ని పూర్తి చేశామని తెలిపారు. ఖరీఫ్-2026లో డిజిటల్ పంటల సర్వే ద్వారా 97 లక్షల ఎకరాల్లో పంటల వివరాలు నమోదు చేశామని చెప్పారు. APAIMS 2.0 ద్వారా ఎరువుల వినియోగాన్ని పర్యవేక్షిస్తూ సుమారు 22 శాతం ఎరువులను ఆదా చేసినట్లు మిగతా2లో...

## 45.72 మీటర్ల ఎత్తుతోనే పోలవరం పూర్తి చేస్తాం: మంత్రి నిమ్మల




**అమరావతి, మన జనప్రగతి సెప్టెంబర్ 18:-** పోలవరం ప్రాజెక్టును 45.72 మీటర్ల ఎత్తుతో, 194.60 టీఎంసీల పూర్తి నిల్వ సామర్థ్యంతో నిర్మించి జాతికి అంకితం చేస్తామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామా నాయుడు తెలిపారు. పోలవరం ఎత్తుపై మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న విమ ర్శలను ఆయన ఖండించారు. మిగతా2లో...



## నంది నాటకోత్సవాలకు రెండ్రోజుల్లో నోటిఫికేషన్: మంత్రి దుర్గేశ్


**అమరావతి, మన జనప్రగతి సెప్టెంబర్ 18:** నంది నాటకోత్సవాలకు సంబంధించి మరో రెండు రోజుల్లో నోటిఫికేషన్ విడుదల చేస్తామని ఆంధ్రప్రదేశ్ సినిమాటోగ్రఫీ, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ తెలిపారు. వచ్చే ఏడాదిలో నంది అవార్డులు అందజేస్తామని చెప్పారు. నంది అవార్డులు ఇవ్వడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ఇప్పటికే గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారని మిగతా2లో...

## ఈగల్ టీమ్ పటిష్ఠ నిఘాతోనే క్రైమ్ రేట్ తగ్గింది: హోం మంత్రి అనిత



**అమరావతి, మన జనప్రగతి సెప్టెంబర్ 18:-** ఈగల్ ప్రధాన కార్యాలయంలో '2026-2029 మాదక ద్రవ్యాల నియంత్రణ విజన్ డాక్యుమెంట్' అమలుపై హోం మంత్రి వంగలపూడి అనిత ఈరోజు(శుక్రవారం) సమీక్ష నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల ఈగల్ టీమ్స్‌తో జూమ్ కాల్ ద్వారా సమీక్షించారు. గంజాయి నిర్మూలనలో పురోగతి, భవిష్యత్ కార్యాచరణను అనితకు ఈగల్ ఐజీ ఆకే రవికృష్ణ వివరించారు. ఈ సందర్భంగా హోంమంత్రి మాట్లాడుతూ.. భావితరాల బంగారు భవిష్యత్తు కోసమే సీఎం చంద్రబాబు ఈగల్ టీమ్‌ను ఏర్పాటు చేశారని తెలిపారు. గంజాయి విక్రయాలు, వినియోగంపై సమాచారం ఇచ్చేందుకు 'బ్రేక్ ద సైలెన్స్' పేరిట 1972 టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఏపీవ్యాప్తంగా 900 గంజాయి హాట్‌స్పాట్లను జియో ట్యాగింగ్ నిఘాతో గత 4 నెలల్లోనే 20 వేలకు పైగా కేసులు నమోదు అయినట్లు హోం మంత్రి వెల్లడించారు. ఈగల్ టీమ్ పటిష్ఠ నిఘాతోనే రాష్ట్రంలో క్రైమ్ రేట్ 14 శాతం తగ్గిందని అనిత పేర్కొన్నారు.

## ఒరిజినల్ రెడ్ల ఆత్మగౌరవం కాపాడేలా పార్టీ పెడతా...: విజయసాయి



**అనంతపురం,మన జనప్రగతి సెప్టెంబర్ 18:** ఒరిజినల్ రెడ్ల ఆత్మగౌరవ పౌరుషాన్ని కాపాడే విధంగా తాను త్వరలో పార్టీ పెడుతున్నానని మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి ప్రకటించారు. అన్ని కులాలు, మతాలను గౌరవించే పార్టీ ఏర్పాటు చేస్తానని స్పష్టం చేశారు. అనంతపురంలో విజయసాయిరెడ్డి ఈరోజు (శుక్రవారం) పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం రెడ్డి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాయలసీమ కేంద్రంగా అభివృద్ధి ఏమి చేశారనే విషయంపై రెండు కుటుంబాలనే ప్రశ్నిస్తున్నానని పేర్కొన్నారు. రాయలసీమ నుంచి రెడ్లు మాత్రమే కాదని.. చాలా మంది దేశం కోసం ప్రాణాలు అర్పించారని కొనియాడారు. విజయదశమి తర్వాత వచ్చే ఏకాదశిన తమ పార్టీ జెండా రెపరెపలాడుతుందని స్పష్టం చేశారు. ఆ రోజు పార్టీ ఆవిర్భావం ఉంటుందని మిగతా2లో...

## మోదీ 25 ఏళ్ల ప్రజా సేవ.. నెల రోజుల పాటు 'సేవా సంకల్ప్ అభియాన్': మాధవ్



**విజయవాడ,మన జనప్రగతి సెప్టెంబర్ 18:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా 25 వసంతాల ప్రజా సేవను పూర్తి చేసుకున్నారని బీజేపీ ఏపీ చీఫ్ పీవీఎన్ మాధవ్ అన్నారు. ఈ సందర్భంగా సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు నెల రోజుల పాటు 'సేవా సంకల్ప్ అభియాన్' నిర్వహిస్తు న్నామని తెలిపారు. ప్రజల్లోకి కేంద్ర ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు, వివిధ సేవా కార్యక్రమా లను పెద్ద ఎత్తున చేపడుతున్నామని చెప్పారు. సమాజ సేవలో నిమగ్నమై పనిచేస్తున్న టీచర్లు, అంగన్వాడీ వర్కర్లు, శానిటరీ వర్కర్లు తదితరులను సన్మానించి వారి సేవలకు గుర్తింపు, గౌరవం కల్పిస్తామన్నారు. యువతలోని సృజనా త్మకతను ప్రోత్సహించేందుకు 'ఇన్నోవేషన్ ఛాలెంజ్' నిర్వహించి, కొత్త ఆవిష్కరణలు చేస్తున్న యువతకు ప్రోత్సాహం అందించనున్న ట్లు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల్లో చిత్రలేఖనం, ఎలక్యూషన్ వంటి పోటీలు నిర్వహించేలా కార్యక్రమాలను రూపొందించా మని మాధవ్ తెలిపారు. మిగతా2లో...



## ఈ నెల 28 నుంచి బంగారు ఉంగరం పథకం

**తమిళనాడు, మన జనప్రగతి సెప్టెంబర్ 18:** తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ సెప్టెంబర్ 28న నవజాత శిశువులకు ఒక గ్రాము బంగారు ఉంగరం అందించే పథకాన్ని ప్రారంభించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ప్రకటించింది. తొలి విడత పంపిణీ కోసం 1.28 లక్షల బంగారు ఉంగరాలను ప్రభుత్వం మిగతా2లో...

# పేదలకు పట్టాభిషేకం

(మొదటి పేజీ తరువాయి)

క్రమబద్ధీకరించ నున్న భూమి విస్తీర్ణం 399.474 ఎకరాలు, విలువ రూ.8,874.27 కోట్లుగా అధికారులు చెబుతున్నారు. విశాఖ రూరల్ మండలంలో అత్యధికంగా 9,261 మంది పట్టాలు అందుకోనున్నారు. మొత్తం 28,445లో 23,283 మందికి కన్వేయన్స్ డీడ్లు, 5,162 మందికి పట్టాలు పంపిణీ చేస్తారు.నగరంలో ప్రభుత్వ స్థలాలు, కొండవాలు ప్రాంతాలు, చెరువు గట్లు...ఇలా పలు ప్రాంతాల్లో దశాబ్దాలుగా కొంతమంది ఆవాసాలు ఏర్పాటుచేసుకుని నివాసం ఉంటున్నారు. ఇళ్లు నిర్మించుకుని జీవిస్తున్నా వాటిపై హక్కులు లేకపోవడంతో ఇబ్బందిపడుతుండేవారు. ఈ నేపథ్యంలో 2014లో సీఎంగా బాధ్యతలు స్వీకరించిన నారా చంద్రబాబునాయుడుకు ఇళ్ల క్రమబద్ధీకరణ సమస్యను ఎమ్మెల్యేలు నివేదించారు. దాంతో అర్హుల వివరాలు సేకరించిన అధికారులు, పలు కేటగిరీలుగా విభజించారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారికి 100 గజాల వరకు ఉచితంగా క్రమబద్ధీకరించేందుకు జీవో 296ను జారీచేశారు. దారిద్ర్యరేఖకు ఎగువనున్న ఆక్రమణదారులకు 100 గజాల వరకు ఉచితం, ఆపై కేటగిరీలుగా సొమ్ము చెల్లించడానికి జీవో 388, గాజువాకలో ఆక్రమణల క్రమబద్ధీకరణ కోసం జీవో 45, యూఎల్‌సీ ఆక్రమణల క్రమబద్ధీకరణకు జీవో 84 జారీచేశారు. 100 గజాల కంటే తక్కువ జాగాల్లో ఇళ్లు నిర్మించుకున్నవారు ఎక్కువమంది ఉన్నారు. ఆయా కేటగిరీల కింద గుర్తించిన ఆక్రమణదారులకు 2017 నుంచి 2019 వరకు మూడు దఫాలుగా పట్టాలు ఇచ్చారు. ఇందుకు సీఎం చంద్రబాబునాయుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో ప్రభుత్వ భూముల్లో నిర్మించిన ఇళ్లపై పేద వర్గాలకు హక్కులు వచ్చాయి. పట్టాలు జారీచేసిన రెండేళ్ల తరువాత కన్వేయన్స్ డీడ్లు ఇవ్వాల్సి ఉంది. అయితే 2019లో వైసీపీ ప్రభుత్వం రావడంతో ఈ విషయాన్ని పట్టించుకోలేదు. తిరిగి 2024లో చంద్రబాబునాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత నగరంలో పట్టాలకు దరఖాస్తు చేయని వారికి మరో అవకాశం ఇచ్చారు. గతంలో పట్టాలు జారీచేసిన వారికి కన్వేయన్స్ డీడ్లు సిద్ధం చేయాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. ఈ మేరకు శనివారం మధ్యాహ్నం పట్టాలు పంపిణీ నిర్వహించనున్నారు. జీవో 296 కింద గతంలో పట్టాలు ఇచ్చిన 22,514 మందికి, జీవో 388 కింద 613 మందికి, జీవో 84 కింద యూఎల్‌సీ భూముల్లో ఆక్రమణల రెగ్యులేషన్ కింద 156 మంది కన్వేయన్స్ డీడ్లు పంపిణీ చేయనున్నారు. గాజువాకలోని ఇనాం భూముల్లో ఆక్రమణల క్రమబద్ధీకరణకు సంబంధించి జీవో 45 కింద 943 మందికి, కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత జారీచేసిన జీవో 30 కింద 4,219 మందికి పట్టాలు పంపిణీ చేయనున్నారు. ముఖ్యంగా కన్వేయన్స్ డీడ్లు తీసుకున్న తరువాత ఇళ్లపై ఆక్రమణదారులకు పూర్తి హక్కులు దఖలు పడతాయి. అవసరాలకు ఇళ్ల క్రయవిక్రయాలు, తాకట్టు పెట్టుకునేందుకు అవకాశం ఉంటుంది. ఇప్పుడు పట్టాలు తీసుకుంటున్న ఆక్రమణదారులు వచ్చే రెండేళ్ల లో కన్వేయన్స్ డీడ్లు పొందనున్నారు. మండలాల వారీగా... మండలం కన్వేయన్స్ డీడ్లు/పట్టాలు, విశాఖ రూరల్ 9,261,ములగాడ 4,213, గాజువాక 4,353, గోపాలపట్నం 3,253, పెందుర్తి 2,722, పెదగంట్యాడ 1,910, మహారాణిపేట 1,235, సీతమ్మధార 668, భీమునిపట్నం 464, ఆనందపురం 349, పద్మనాభం 17, సర్వం సిద్ధం

# మోదీ 25 ఏళ్ల ప్రజా సేవ.. నెల రోజుల పాటు 'సేవా సంకల్ప్ అభియాన్': మాధవ్

(మొదటి పేజీ తరువాయి)

మొత్తం13 రకాల కార్యక్రమాలను నెల రోజుల పాటు నిర్వహించనున్నట్లు చెప్పారు. అక్టోబర్ 17న ఢిల్లీలో దేశవ్యాప్తంగా ప్రజా ప్రతినిధులు పాల్గొనేలా భారీ కార్యక్రమం నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించామన్నారు. నిన్న (గురువారం) దేశవ్యాప్తంగా 'ఆశీర్వాద దీపం' కార్యక్రమాన్ని ప్రజలు స్వచ్ఛందంగా నిర్వహిం చారని తెలిపారు.మోదీ ప్రజా సేవకు గుర్తిం పుగా, ఆయనకు భగవంతుడి ఆశీస్సులు లభించి ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ ప్రజలు ఇళ్ల ముందు దీపాలు వెలిగించారని మాధవ్ అన్నారు. 'సేవా సంకల్ప్ అభియాన్ పార్టీకి సంబంధించిన కార్యక్రమం కాదని.. ప్రజలందరికీ సంబంధించిన కార్యక్రమం' అని స్పష్టం చేశారు. మోదీ కుటుంబ సభ్యులు, ప్రజలు, యువత, సేవా సంస్థలు ప్రతి ఒక్కరూ ఇందులో భాగస్వాములు కావాలని పీవీఎన్ మాధవ్ కోరారు.

# ఒరిజినల్ రెడ్ల ఆత్మగౌరవం కాపాడేలా పార్టీ పెడతా...: విజయసాయి

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. త్వరలో తన కూతురు టీవీ ఛానల్ పెడుతున్నారని, ఆ ఛానల్‌కు తనకు సంబంధం లేదని వెల్లడించారు. ఆ ఛానల్ న్యూటరల్‌గా ఉంటుందని చెప్పుకొచ్చారు. తమ పార్టీ కనుమరుగయ్యే అవకాశం లేదని.. తమిళనాడు సీఎం విజయ్ టీవీకే పార్టీ తరహాలో ఇక్కడి ప్రజలు తమకు ఓట్లు వేస్తారని పేర్కొన్నారు.**రాయలసీమపై ఆ రెండు కుటుంబాలకు ప్రేమ లేదు..** రాయలసీమపై ఆ రెండు కుటుంబాలకు ప్రేమ లేదని.. ఓట్ల కోసమే రాజకీయాలు చేస్తున్నారని విజయసాయిరెడ్డి విమర్శించారు. వైసీపీ అధినేత జగన్ కోసం రక్తం చిందిస్తామని గ్రామ గ్రామాన చెబుతున్నారని... ఆ రెండు కుటుంబాల కోసం కాకుండా గ్రామాలు, రాష్ట్రం కోసం యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. శ్రీభాగ్ ఒడంబడిక ఏమయ్యిందో చంద్రబాబు, జగన్ సమాధానం చెప్పాలని పట్టుబట్టారు. రాయలసీమలో ఉపాధి కరువై ఇక్కడి ప్రజలు వలసలు పోతున్నారని చెప్పుకొచ్చారు. కొత్త తరం రాజకీయాల్లోకి రావాలని కోరారు. రెండు కుటుంబాలు ఉన్నంత కాలం రాష్ట్రం బాగుపడదని తెలిపారు. **యువతను ముఖ్యమంత్రిని చేస్తా..** ప్రతి ఒక్కరి నెత్తిన రూ. 5 లక్షల అప్పు ఉందని.. పుట్టబోయే బిడ్డకు కూడా అప్పు ఉందని విజయసాయిరెడ్డి ప్రస్తావించారు. 15 ఏళ్లుగా ఆంధ్ర గంజాయి సాగులో ముందంజులో ఉందని అన్నారు. పోటీ తత్వం ఉంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. తాను పెట్టబోయే పార్టీ ఏపీలో మూడో ప్రత్యామ్నాయంగా ఉంటుందని చెప్పుకొచ్చారు. తన పార్టీకి ఓటు వేస్తే సమాజానికి మంచి చేసే వారు ఎవరైనా యువతను ముఖ్యమంత్రిని చేస్తానని ప్రకటించారు. తాను ఏపీకి దిశానిర్దేశం చేస్తానని విజయసాయిరెడ్డి పేర్కొన్నారు.**ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తాం..** 'విద్యా విధానంలో వివక్షత ఉందని... దీన్ని రూపుమాపేందుకు మా పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తాం. ఉచితంగా విద్య అందిస్తాం. క్వాలిటీ ఎడ్యుకేషన్, క్వాలిటీ టీచర్లను నియమించి విద్యావిదానంలో సమూల మార్పులు తీసుకువస్తాం. ఐదేళ్లకు 30 లక్షల ఉద్యోగాలు కల్పించేలా మా పార్టీ విద్యావిధానం ఉంటుంది. నిరుద్యోగులకు ఉత్తిత్తి హామీ ఇవ్వను. ఉద్యోగం వచ్చేంత వరకూ నిరుద్యోగులకు నెలకు రూ.10 వేల అలవెన్స్ ఇస్తాను. అకౌంటెబిలిటీ ఉండేలా తగిన చట్టం చేస్తాం. గ్రామగ్రామాన గంజాయి సమస్య ఉందని.. కఠిన చట్టాలతో గంజాయి వ్యాపారాన్ని కట్టడి చేస్తాం. ఏపీపీఎస్సీ ద్వారా జనవరి ఒకటో తేదీన జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తాం. ఔట్ సోర్సింగ్ విధానం ఉండదు. ఏ ఉద్యోగమైనా ప్రభుత్వ ఉద్యోగి ఉంటారు. డీఎస్సీ విధానం ఉండదు...ప్లే గ్రౌండ్ ఎంతో తెలియని వాళ్లకు ఉద్యోగాలు వచ్చాయి. ఎలాంటి ఒత్తిడి లేకుండా ఉద్యోగాలు భర్తీ చేస్తాం. ప్రలోభపెట్టి మత మార్పిడి చేయడానికి నేను వ్యతిరేకం. ఎన్నికల్లో 66 శాతం యువతకు రిజర్వేషన్ ఉంటుంది. ప్రతి సామాజిక వర్గానికి చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పిస్తాం' అని విజయసాయిరెడ్డి పేర్కొన్నారు.

# దుగరాజపట్నంలో గ్రీన్‌ఫీల్డ్ షిప్‌యార్డ్..

## ఎండీఎల్‌తో ఏపీ సర్కార్ ఎంవోయూ

**అమరావతి, మన జనప్రగతి సెప్టెంబర్ 18:** ఏపీలోని దుగరాజపట్నంలో గ్రీన్‌ఫీల్డ్ షిప్‌యార్డ్ ఏర్పాటు కానుంది. ఈ మేరకు ఎండీఎల్‌తో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో ఈ ఎంవోయూ చేసుకున్నారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా రూ.15,000 కోట్ల పెట్టుబడితో 45 వేల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఏడాదికి 12 లక్షల టన్నుల నౌకల నిర్మాణ సామర్థ్యాన్ని ఈ గ్రీన్‌ఫీల్డ్ షిప్‌యార్డ్ కలిగి ఉంది.కాగా, సీఎం చంద్రబాబు అధ్యక్షతన 21వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశం ఈరోజు (శుక్రవారం) సచివాలయంలో జరిగింది. ఈ సమావేశంలో మొత్తం 29 పారిశ్రామిక ప్రాజెక్టులకు సంబంధించిన పెట్టుబడులపై సీఎం చర్చించారు. దాదాపు రూ.22 వేల కోట్ల విలువైన పెట్టుబడులకు సంబంధించిన ప్రాజెక్టులపై ఎస్ఐపీబీ సమావేశంలో ఆమోదం తెలిపే అవకాశాలు ఉన్నాయి. తద్వారా దాదాపు 20 వేల



మందికి ఉద్యోగాలను కల్పించనున్నారు. ఇప్పటివరకు జరిగిన 20 ఎస్ఐపీబీ సమావేశాల్లో 359 ప్రాజెక్టులకు ఆమోదం తెలిపారు. రూ.13.84 లక్షల కోట్ల పెట్టుబడులు, 10.59 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. ఎస్ఐపీబీ సమావేశానికి మంత్రులు నారా లోకేశ్, టీజీ భరత్, అనగాని సత్యప్రసాద్, వాసంశెట్టి సుభాశ్, పి.నారాయణ, కందుల దుర్గేశ్, గొట్టిపాటి రవికుమార్, బీసీ జనార్దన్ రెడ్డి, సీఎస్ సాయిప్రసాద్, పరిశ్రమలు, ఐటీ, ఐ అండ్ ఐ శాఖల కార్యదర్శులు హాజరయ్యారు.

# డిజిటల్ వ్యవసాయంలో ఏపీ ముందంజ

(మొదటి పేజీ తరువాయి)

వెల్లడించారు. ఎల్‌నినో పరిస్థితుల్లోనూ పప్పుధాన్యాల సాగులో 99 శాతం లక్ష్యాన్ని సాధించామని మంత్రి తెలిపారు. కంటింజెన్సీ విత్తనాలను 80 శాతం రాయితీపై అందించేందుకు రూ.200 కోట్లు కేటాయించామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 115 రైతు బజార్లను క్రియాశీలం చేసి రైతులకు గిట్టుబాటు ధర, వినియోగదారులకు అందుబాటు ధర కల్పించేలా చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. పంటల బీమాకు 44 లక్షల దరఖాస్తులు అందాయని, సుమారు 17 లక్షల హెక్టార్లకు రూ.16 వేల కోట్ల బీమా రక్షణ కల్పించినట్లు అచ్చెన్నాయుడు తెలిపారు. బీమా క్లెయిమ్‌లను త్వరగా పరిష్కరించడంతో పాటు కేంద్రం నుంచి రావాల్సిన నిధులను సకాలంలో విడుదల చేయాలని కోరారు. కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో రైతుల ప్రయోజనాలకు చర్యలు కొనసాగిస్తామని చెప్పారు.

# 45.72 మీటర్ల ఎత్తుతోనే పోలవరం పూర్తి చేస్తాం: మంత్రి నిమ్మల

(మొదటి పేజీ తరువాయి)

గత వైసీపీ ప్రభుత్వం 2022లో పోలవరం ప్రాజెక్టును ఫేజ్-1, ఫేజ్-2గా విభజించి 41.15 మీటర్ల ఎత్తును ప్రతిపాదించిందని మంత్రి ఆరోపించారు. 2019లోనే 45.72 మీటర్ల ఎత్తుకు సాంకేతిక సలహా కమిటీ ఆమోదం లభించిందని పేర్కొన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం 45.72 మీటర్ల ఎత్తు, 194.60 టీఎంసీల సామర్థ్యంతోనే పనులు కొనసాగిస్తోందన్నారు.గత ప్రభుత్వ హయాంలో డయాఫ్రం వాల్ దెబ్బతినడంతో ప్రాజెక్టు నిర్మాణం క్లిష్టంగా మారిందని మంత్రి పేర్కొన్నారు. కేంద్ర సహకారంతో పనులను తిరిగి గాడిలో పెట్టామని, నిర్ణీత గడువులో పోలవరం పూర్తి చేయడమే లక్ష్యమన్నారు.పట్టిసీమ ద్వారా ఈ సీజన్‌లో ఇప్పటివరకు 45 టీఎంసీలకు పైగా గోదావరి జలాలను కృష్ణా డెల్టాకు తరలించినట్లు తెలిపారు. పురుషోత్తపట్నం లిఫ్ట్ స్కీమ్ ద్వారా 16.6 టీఎంసీల నీటిని ఎత్తిపోశామని మంత్రి వెల్లడించారు.

# నంది నాటకోత్సవాలకు రెండ్రోజుల్లో నోటిఫికేషన్: మంత్రి దుర్గేశ్

(మొదటి పేజీ తరువాయి)

వెల్లడించారు. కందుకూరి వీరేశలింగం జయంతి రోజున నాటక రంగ దినోత్సవాన్ని నిర్వహిస్తామన్నారు.నంది నాటకోత్సవాలు జరిగే సమయంలోనే అవార్డులు కూడా అందజేస్తామని మంత్రి తెలిపారు. ఏపీ, తెలంగాణ సంయుక్తంగా అవార్డులు ఇవ్వాలని భావించినప్పటికీ.. రెండు రాష్ట్రాల్లో అవార్డుల తేదీలు వేర్వేరుగా ఉండటంతో అది సాధ్యం కావడం లేదని మంత్రి వివరించారు. ఇతర రాష్ట్రాల్లోని తెలుగు నాటకాలకు కూడా అవకాశం కల్పిస్తామన్నారు. అన్ని జిల్లాల నుంచి ప్రాతినిధ్యం ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. త్వరలోనే అవార్డుల కమిటీని ఏర్పాటు చేస్తామని కందుల దుర్గేశ్ వెల్లడించారు.

# ఈ నెల 28 నుంచి బంగారు ఉంగరం పథకం

(మొదటి పేజీ తరువాయి)

సమీకరించింది. ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఆసుపత్రుల్లో జన్మించే శిశువులందరికీ ఈ ఉంగరాలను అందించనున్నట్లు అధికారిక ప్రకటనలో తెలిపింది.

ప్రతి బంగారు ఉంగరానికి ప్రత్యేక సీరియల్ నంబర్ ఉంటుంది. అలాగే ఉంగరాలను ట్యాంపర్ ప్రూఫ్ ప్యాకేజింగ్‌లో అందించనున్నారు. ఈ పథకం ప్రయోజనం పొందాలంటే లబ్ధిదారులు తమిళనాడు శాశ్వత నివాసితులై ఉండాలి అని ప్రభుత్వం స్పష్టం చేసింది.

# ఎన్నికల్లో ఉమ్మడి అజెండాతో వెళ్లనున్న కూటమి పార్టీలు: మంత్రి సత్యకుమార్




**విజయవాడ,మన జనప్రగతి సెప్టెంబర్ 18:** కూటమిలో ఎప్పుడు విభేదాలు వస్తాయా? అని వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి గోతికాడ గుంటనక్కలా ఎదురు చూస్తున్నారని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ వ్యంగ్యంగా అన్నారు. గురువారం గన్నవరం సామాజిక ఆసుపత్రిలో వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ.. టీడీపీ, జనసేన, బీజేపీ మూడు పార్టీలు సమన్వయంతో పని చేస్తున్నాయని అన్నారు. ఎన్నికల్లో ఈ మూడు పార్టీలు ఉమ్మడి అజెండాతో ప్రజల ముందుకు వెళ్లతాయని పేర్కొన్నారు.సీఎం చంద్రబాబు, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్‌తోపాటు బీజేపీ నాయకత్వం దీర్ఘకాలం కలిసి పనిచేయాలని ప్రజలు అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. 15, 20 ఏళ్ల పాటు కూటమి కొనసాగాలనే ఆలోచన వారిలో ఉందని అన్నారు. ఎన్డీఏ కూటమిలో జనసేన పార్టీ కీలక భాగస్వామిగా వ్యవహరిస్తోందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వాన్ని బలోపేతం చేయడంతో పాటు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంపై ఈ మూడు పార్టీలు దృష్టి సారించాయని మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు.

# మాజీ మంత్రి అంబటి రాంబాబుకు ఈడీ నోటీసులు..

**అమరావతి, మన జనప్రగతి సెప్టెంబర్ 18:** మాజీ మంత్రి, వైసీపీ నేత అంబటి రాంబాబుకు ఈడీ నోటీసులు జారీ చేసింది. సెప్టెంబర్ 11న విచారణకు హాజరుకావాలని నోటీసులు పంపినట్లు అధికారులు ఫోన్ ద్వారా తెలిపారు. అయితే తనకు నోటీసులు అందలేదని అంబటి పేర్కొన్నారు. విచారణకు తప్పనిసరిగా హాజరుకావాలని ఈడీ స్పష్టం చేసినట్లు తెలుస్తోంది.



మనజనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
19 - 09 - 2026

# టౌన్ బ్యాంకు లెక్కలు తేల్చాల్సిందే..!

**- సమగ్ర విచారణ జరిపి వాస్తవాలు వెల్లడించాలి: మాజీ ఎమ్మెల్యే రాచమల్లు**



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి సెప్టెంబర్ 18:-** టౌన్ బ్యాంకు వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచాలని మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం దొరసానిపల్లెలోని ఆయన నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సుచరితకు చెందాల్సిన సొమ్ము ఉపసంహరణ వ్యవహారంలో ఖాతా ఎలా ప్రారంభమైంది, నగదు ఎవరు డ్రా చేశారనే అంశాలను నిగ్గుతేల్చాలన్నారు. సీసీ కెమెరా దృశ్యాలు, లెడ్జర్ రికార్డులను పరిశీలించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, బ్యాంకు అధికారుల పాత్రపైనా విచారణ జరపాలని కోరారు. తనపై గత ఐదేళ్లుగా ఆరోపణలు చేస్తున్నారని, అవి నిజమైతే విచారణ ద్వారా నిరూపించాలని అన్నారు. సుందరయ్య కాలనీ, చౌటపల్లి భూముల వ్యవహారాలతో తనకు సంబంధం లేదని స్పష్టం చేశారు. ప్రజలు, ఖాతాదారుల ప్రయోజనాల కోసమే టౌన్ బ్యాంకు అంశాన్ని ప్రశ్నిస్తున్నట్లు రాచమల్లు పేర్కొన్నారు.

# దేవగిరి ప్రజలకు ఫ్రైడే డ్రైడే అవగాహన




**బొమ్మనహల్ మన జనప్రగతి సెప్టెంబర్ 18 :-** మండల పరిధిలో దేవగిరి గ్రామ ప్రజలకు ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా మన ఆరోగ్యం మన చేతుల్లోనే అనే నినాదంతో పరిసరాల పరిశుభ్రత,ఆరోగ్య భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు,అనంతరం వైద్యులు ఇంటి పరిసరాల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించి,డ్రమ్ములు, తొట్లు,కూలర్లు,పాత టైర్లు, కొబ్బరి చిప్పలు,పూల కుండీలను వారానికోసారి శుభ్రం చేసుకోవాలని సూచించారు, దోమల నివారణకు సాయంత్రం వేళ వేపాకు పొగ వేయాలని, రాత్రి దోమతెరలు ఉపయోగించాలని,కిటికీలకు మెష్‌లు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు,జ్వరం వచ్చిన వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి రక్త పరీక్ష చేయించుకోవాలని సూచించారు,ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త గోవర్ధన్,ఆశా కార్యకర్తలు శ్రావణి,లక్ష్మీదేవి, ప్రజలు పాల్గొన్నారు.

# సరస్వతిపల్లె సర్పంచ్ అభ్యర్థిగా ఆదరించండి

**- టీడీపీ జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి పిల్లిండ్ల మహేష్**



**రామాపురం మన జనప్రగతి సెప్టెంబర్ 18:-**రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో రామాపురం మండలంలోని సరస్వతిపల్లె గ్రామంలో రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది. గ్రామ పంచాయతీ ఎస్సీ రిజర్వేషన్‌లోకి వస్తే సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు టీడీపీ జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి పిల్లిండ్ల మహేష్ తెలిపారు.మాజీ తెలుగు యువత మండల ఉపాధ్యక్షుడిగా రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన మహేష్ ప్రస్తుతం టీడీపీ జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు. గ్రామంలోని యువత సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ ప్రజలతో మమేకమై పనిచేస్తున్నారని ఆయన అనుచరులు తెలిపారు.పార్టీ పదవి ఉన్నప్పటికీ గ్రామానికే పరిమితం కాకుండా ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యలను తెలుసుకుంటున్నారని పేర్కొన్నారు. కుల, మత, రాజకీయ భేదాలు లేకుండా ప్రతి ఒక్కరినీ కలుపుకొని ముందుకు సాగుతున్నారని తెలిపారు. ఎస్సీ వర్గాల హక్కులు, సంక్షేమ పథకాల అమలుపై కూడా ఆయన నిరంతరం కృషి చేస్తున్నారని చెప్పారు.సరస్వతిపల్లె గ్రామ అభివృద్ధికి యువత భాగస్వామ్యం, ప్రజల సమస్యల పరిష్కారం, మౌలిక వసతుల మెరుగుదల వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలనే లక్ష్యంతో మహేష్ ముందుకు సాగుతున్నట్లు అనుచరులు తెలిపారు. పార్టీ అధిష్టానం ఆదేశిస్తే ఎన్నికల బరిలోకి దిగేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఆయన స్పష్టం చేశారు.గ్రామ సర్పంచ్ అభ్యర్థిత్వంపై ప్రస్తుతం సరస్వతిపల్లెలో చర్చ జరుగుతోందని, మహేష్‌కు ప్రజల నుంచి మద్దతు లభిస్తోందని ఆయన అనుచరులు పేర్కొన్నారు.

# సీఐ జయన్నను సస్పెండ్ చేయాలని సంతకాల సేకరణ

- **జర్నలిస్టుపై దురుసు ప్రవర్తనను ఖండించిన ప్రజా సంఘాలు**
- **విధుల నుంచి బహిష్కరించాలని డిమాండ్**




**పత్తికొండ మన జనప్రగతి సెప్టెంబర్ 18:-**పత్తికొండ అర్బన్ సీఐ జయన్నను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ జర్నలిస్ట్ జేఏసీ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం నాలుగు స్తంభాల మండపం వద్ద సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజలు, జర్నలిస్టులు స్వచ్ఛందంగా పాల్గొని సంతకాలు చేశారు.ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు డి. రాజా సాహెబ్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కారం నాగరాజు, సీఐటీయూ మండల కార్యదర్శి రవిచంద్ర, లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షులు ఆనందాచారి, బీజేపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు ఆవుల సోమన్న, జర్నలిస్ట్ జేఏసీ నాయకులు ఎం. సాలంగడు మాట్లాడుతూ.. వార్తా సేకరణ కోసం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన విశాలాంధ్ర విలేఖరి ఎం. నాగరాజుపై సీఐ జయన్న దురుసుగా ప్రవర్తించారని ఆరోపించారు.జర్నలిస్టు మెడ పట్టుకుని బయటకు పంపించడంతో పాటు దుర్భాషలాడిన ఘటనను తీవ్రంగా ఖండించారు. పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించేలా వ్యవహరించిన సీఐ జయన్నపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని, తక్షణమే విధుల నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సీపీఐ పత్తికొండ, దేవనకొండ మండలాల కార్యదర్శులు కారుమంచి, నరసారావు, జిల్లా సమితి సభ్యులు గురుదాస్, కారన్న, గిడ్డయ్య గౌడ్, నెట్టి కంటయ్య, లోక్‌సత్తా పార్టీ నియోజకవర్గ అధ్యక్షులు జయరాముడు, జర్నలిస్టులు ఎం. రంగన్న, లక్ష్మీనారాయణ, పక్కీరప్ప, వెంకటేశ్వర్లు, గిడ్డయ్య, రమేష్, ప్రకాష్ రెడ్డి, జాఫర్, మనోహర్, నరేష్, శివశంకర్, ఈరన్న రమేష్, ప్రజా సంఘాల నాయకులు ఉపేంద్ర, మాదన్న, రాజప్ప పాల్గొన్నారు.

# లక్ష్యం..క్రమశిక్షణ..కృషి..విద్యార్థుల విజయానికి కీలకం: జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి



**కర్నూలు బ్యూరో గూడూరు మన జనప్రగతి సెప్టెంబర్ 18:-**విద్యార్థులు స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని, క్రమశిక్షణతో కష్టపడి చదివి జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి సూచించారు. ఉపాధ్యాయుల సూచనలు పాటిస్తూ తమలోని ప్రతిభను మెరుగుపరుచుకుని ఉన్నత విద్య, మంచి ఉద్యోగ అవకాశాలను సాధించాలని ఆకాంక్షించారు.శుక్రవారం గూడూరు మండలం పెంచికలపాడు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి పాఠశాలలో అందుతున్న విద్యాబోధన, మధ్యాహ్న భోజనం, తాగునీరు, మరుగుదొడ్లు తదితర మౌలిక సదుపాయాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.పాఠశాలలో ప్రతిరోజూ బోధించిన పాఠాలను అదే రోజు ఇంటి వద్ద పునశ్చరణ చేసుకోవాలని సూచించారు. మొబైల్ ఫోన్లను వినోదం కోసం కాకుండా విద్యాభ్యాసానికి ఉపయోగించుకోవాలన్నారు. ముఖ్యంగా ఇంగ్లీష్‌తో పాటు ఇతర విద్యా విషయాలను నేర్చుకునేందుకు అందుబాటులో ఉన్న డిజిటల్ వనరులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు పిల్లల భవిష్యత్తు కోసం ఎంతో కష్టపడతారని, వారు ఇచ్చే సూచనలు పిల్లల మంచి కోసమేనని కలెక్టర్ తెలిపారు. తల్లిదండ్రులను గౌరవిస్తూ ఇంటి పనుల్లో సాధ్యమైనంత వరకు సహకరించాలన్నారు. పేదరికం, ఇతర ఇబ్బందులు జీవితంలో ముందుకు వెళ్లేందుకు అడ్డంకులు కాకూడదని, విద్య ద్వారా ఉన్నత అవకాశాలను అందిపుచ్చుకుని కుటుంబ ఆర్థిక పరిస్థితిని మార్చుకోవచ్చని పేర్కొన్నారు.విద్యార్థులు సంతోషంగా, ప్రశాంతంగా ఉండాలని, ద్వేషం, ఈర్ష్య, కక్ష వంటి భావాలకు దూరంగా ఉండాలని సూచించారు. వీలైనప్పుడు ఇతరులకు సహాయం చేస్తూ, ఎవరికీ హాని కలిగించకుండా మంచి మనసుతో జీవించాలని హితవు పలికారు.పాఠశాలలో అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతపై కలెక్టర్ విద్యార్థులను నేరుగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాల వంటశాలను పరిశీలించి, విద్యార్థులకు రుచికరమైన, నాణ్యమైన భోజనం అందించాలని వంట సిబ్బందిని ఆదేశించారు.పాఠశాల పరిసరాల్లో నాటిన మొక్కలను పరిశీలించిన కలెక్టర్ గానుగ, వేప వంటి చెట్లను విరివిగా పెంచాలని సూచించారు. ప్రస్తుతం పాఠశాలలో పదో తరగతి ఉత్తీర్ణత 90 శాతం ఉందని, దానిని 100 శాతానికి తీసుకువచ్చేలా విద్యార్థులు కష్టపడి చదవాలని సూచించారు. ఎఫ్ఏ-1 పరీక్షల్లో 30కి పైగా మార్కులు సాధించిన విద్యార్థులను కలెక్టర్ అభినందించారు.ఈ కార్యక్రమంలో డీఈవో సుధాకర్, సర్వశిక్ష అభియాన్ పీఓ లోక్‌రాజ్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ ప్రియంవద, గూడూరు తహసీల్దార్ వెంకటేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ఆస్పత్రుల్లో మరింత మెరుగ్గా వైద్య సేవలు అందించాలి






**సాధారణ ప్రసవాలను పెంచాలి..మాతా,శిశు మరణాల రేటు తగ్గించాలి: జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి**

**కర్నూలు బ్యూరో గూడూరు మన జనప్రగతి సెప్టెంబర్ 18:-**జిల్లాలో గర్భిణులు, ప్రసవానంతర తల్లులు, చిన్నారులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి వైద్యాధికారులను ఆదేశించారు. ఆంటినేటల్, పోస్ట్‌నేటల్ కేర్ నమోదులు 100 శాతం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. శుక్రవారం గూడూరు మండల కేంద్రంలోని పీహెచ్‌సీ, తహసీల్దార్ కార్యాలయం, బస్టాండ్‌ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.పీహెచ్‌సీలో గర్భిణులు, శిశువులకు నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం టీకాలు అందించాలని, ఏ చిన్నారి కూడా టీకాలకు దూరం కాకుండా పర్యవేక్షించాలని తెలిపారు. రోగుల ఓపీ వివరాలను ఈ-ఔషధిలో నమోదు చేయడంతో పాటు వైద్య సేవలు, మందుల వినియోగం తదితర వివరాలను సక్రమంగా నమోదు చేయాలని ఆదేశించారు.జిల్లాలో సాధారణ ప్రసవాల సంఖ్య పెంచేందుకు చర్యలు చేపట్టాలని, మాతా, శిశు మరణాల రేటును తగ్గించేలా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రజలకు అవసరమైన మందులు, పరీక్షలు సకాలంలో అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. పీహెచ్‌సీ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు మొక్కలను సంరక్షించాలని సూచించారు. **అర్జీలను గడువులోపు పరిష్కరించాలి** 22ఏ, రీ-సర్వే, ఆర్వోఆర్, పీజీఆర్ఎస్ అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని తహసీల్దార్‌ను కలెక్టర్ ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న ఫారాలను త్వరితగతిన పూర్తి చేసి కార్యాలయం ద్వారానే ఫైళ్లను పంపాలని సూచించారు.గూడూరు తహసీల్దార్ కార్యాలయ భవనం శిథిలావస్థలో ఉన్నందున గూడూరుతో పాటు ఆలూరు, కర్నూలు అర్బన్, కర్నూలు రూరల్ తహసీల్దార్ కార్యాలయాలకు నూతన భవనాల ఏర్పాటుపై చర్యలు తీసుకోవాలని డీఆర్వోను ఆదేశించారు. **బస్టాండ్‌లో సౌకర్యాలపై ఆరా** బస్టాండ్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఏపీఎస్ఆర్టీసీ ఆర్ఎంను ఆదేశించారు. ప్రయాణికులతో మాట్లాడి తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు.గూడూరు పాత బస్టాండ్‌లో కమ్యూనిటీ మరుగుదొడ్డి నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి మంగళవారం నాటికి పంపాలని మున్సిపల్ కమిషనర్, ఆర్టీసీ ఆర్ఎం, తహసీల్దార్‌లను ఆదేశించారు. డీఎంహెచ్ఓ డా. కామేశ్వర ప్రసాద్, ఆర్టీసీ ఆర్ఎం శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ ప్రియంవద, తహసీల్దార్ వెంకటేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ఆదోనిలో గణేష్ నిమజ్జనోత్సవం

**భద్రతా ఏర్పాట్లను ,నిమజ్జన శోభాయాత్రను కాలినడకన పర్యటించి పరిశీలించిన జిల్లా ఎస్పీ**

**చిన్న హరివానం వద్ద ఎల్లెల్సీ కెనాల్ వద్ద నిమజ్జన ఘాట్‌ను పరిశీలించిన ఎస్పీ**



**ఆదోని మన జనప్రగతి సెప్టెంబర్ 18:-**ఆదోని పట్టణంలో శుక్రవారం నిర్వహిస్తున్న గణేష్ నిమజ్జనోత్సవం సందర్భంగా కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ భద్రతా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి పర్యవేక్షించారు.ముందుగా ఆదోని టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల కంట్రోల్ రూమ్‌ను జిల్లా ఎస్పీ పరిశీలించారు.కంట్రోల్ రూమ్ నుంచి పట్టణంలోని ప్రధాన కూడళ్లు, నిమజ్జన శోభాయాత్ర సాగే మార్గాల్లోని సీసీ కెమెరాల దృశ్యాలను పరిశీలిస్తూ బందోబస్తు పరిస్థితిని సమీక్షించారు.అనంతరం నిమజ్జన శోభాయాత్ర మార్గంలో జిల్లా ఎస్పీ కాలినడకన పర్యటించి, భద్రతా ఏర్పాట్లు, పోలీసు బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణను స్వయంగా పరిశీలించారు.ఆదోని సమీపంలోని చిన్న హరివానం వద్ద గల ఎల్లెల్సీ కాలువ వద్ద వినాయక నిమజ్జన ఘాట్‌ను అక్కడ చేపట్టిన భద్రతా ఏర్పాట్లను ప్రత్యక్షంగా పరిశీలించారు.ఘాట్ వద్ద బందోబస్తు విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు.విగ్రహాల నిమజ్జనం సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, ప్రమాదాలు చోటుచేసుకోకుండా ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.జిల్లా ఎస్పీ పలు సూచనలు చేశారు.గణేష్ నిమజ్జనం పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉండి,ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.శోభాయాత్ర మార్గాల్లో ప్రజలకు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ నియంత్రణను పక్కాగా అమలు చేయాలని సూచించారు.ఇతర శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంత వాతావరణంలో సజావుగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు.గణేష్ నిమజ్జనోత్సవం ప్రశాంతంగా,విజయవంతంగా జరిగేందుకు ప్రజలు,ఉత్సవ కమిటీ నిర్వాహకులు పోలీసు శాఖకు సహకరించాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు. ఎస్పీ గారితో డిఎస్పీ ఉపేంద్రబాబు,సీఐలు మధుసుధన్ రావు, కేశవరెడ్డి, రాజశేఖర్ రెడ్డి, నల్లప్ప, ఇస్సి ఎస్సై మహేష్ కుమార్ మరియు స్పెషల్ పార్టీలు,ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మనజనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక



# గణేష్ లడ్డు వేలం పాట రూ.71,116

### - లడ్డు దక్కించుకున్న రాజారావు టీచర్



**రామాపురం మన జనప్రగతి సెప్టెంబర్ 18:**-నల్లగుట్ట పల్లి గ్రామం కొత్తపల్లిలో గణేష్ ఉత్సవాలలో భాగంగా జరిగిన లడ్డు వేలం పాటలో బొంగాని రాజారావు రూ.71,116 గణేష్ లడ్డూను వేలంలో దక్కించుకోవడం జరిగింది. గతంలో లడ్డు వేలం పాట పాడి లడ్డూను దక్కించుకున్న వారికి మంచి జరగడం వలన ఈ సంవత్సరం లడ్డు వేలం పాటకు పోటీ బాగా పెరిగింది. ఈ పోటీలో చివరి వరకు రాజారావు వేలంపాటను పాడి స్వామివారి లడ్డును వేలంలో దక్కించుకోవడం జరిగింది. గ్రామస్తులు ఆయనను శాలువ పూలహారంతో సన్మానం చేసి ఆయనకు లడ్డూను అందచేసి మంగళ వాయిద్యాలతో వారి ఇంటి వరకు తీసుకెళ్లారు. ఈ డబ్బులతో వచ్చే ఏడాది గణేశ ఉత్సవాలు జరుపుతామని గ్రామస్తులు తెలిపారు.

# ప్రజా భద్రతపై పోలీసుల విస్తృత అవగాహన



**రాయచోటి మన జనప్రగతి సెప్టెంబర్ 18:**-అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్ ఆదేశాలతో పోలీసులు జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లో రాత్రి బస చేస్తూ ప్రజా భద్రతపై అవగాహన కల్పిస్తున్నారు.మహిళలు,చిన్నారుల రక్షణ,పోక్సో చట్టం,సైబర్ నేరాలు,గంజాయి నిర్మూలన,హెల్మెట్ వినియోగం, రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా కమిటీలకు సూచనలు చేస్తూ,రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ప్రశాంత వాతావరణం ఉండేలా భరోసా కల్పిస్తున్నారు.నేర రహిత సమాజం కోసం ప్రజలు పోలీసులకు సహకరించాలని అధికారులు కోరారు.

# సర్వేపల్లి కాలువకట్ట వాసులకు పట్టాల పంపిణీకి ఏర్పాట్లు



**నెల్లూరు,మన జనప్రగతి సెప్టెంబర్ 18:**- నెల్లూరు సిటీ నియోజకవర్గంలోని సర్వేపల్లి కాలువకట్ట ప్రాంతానికి చెందిన 1,215 కుటుంబాలకు శాశ్వత పట్టాల పంపిణీకి ఏర్పాట్లు జరుగుతున్నాయని డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ తెలిపారు. శుక్రవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.మంత్రి పొంగూరు నారాయణ చొరవతో రాష్ట్ర మంత్రివర్గం ఈ నెల 3న ఆమోదం తెలిపిందని, దీంతో పట్టాల పంపిణీకి మార్గం సుగమమైందని చెప్పారు.20న ఉదయం 11.30 గంటలకు ముఖ్యమంత్రి చంద్రబాబు వర్చువల్ విధానంలో పట్టాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.భగత్‌సింగ్ కాలనీలో గతేడాది 1,400 కుటుంబాలకు శాశ్వత పట్టాలు అందించినట్లు రూప్‌కుమార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో నగర టీడీపీ అధ్యక్షుడు మామిడాల మధు, కార్పొరేటర్ కర్తం ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# స్వర్గీయ రాజగోపాల్ రెడ్డి 13వ వర్ధంతి..ఘన నివాళి

**కడప మనజన ప్రగతి సెప్టెంబర్ 18:**-ప్రజానేత, మాజీ మంత్రి స్వర్గీయ శ్రీ రెడ్డెప్పగారి రాజగోపాల్ రెడ్డి 13వ వర్ధంతి సందర్భంగా టీడీపీ జోనల్ కో-ఆర్డినేటర్ శ్రీనివాసరెడ్డి ప్రభుత్వ విప్, కడప శాసనసభ్యురాలు మాధవి కుటుంబ సమేతంగా ఘన నివాళులర్పించారు.ఈ సందర్భంగా అన్నమయ్య జిల్లా లక్కిరెడ్డిపల్లి మండల కేంద్రంలోని శ్రీ రాజగోపాల్ రెడ్డి ఘాట్ వద్దకు చేరుకుని పూలమాలలు వేసి అంజలి ఘటించారు. అనంతరం చింతలవాండ్లపల్లి గ్రామంలో స్వర్గీయ రాజగోపాల్ రెడ్డి కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాయలసీమ ప్రగతికి, ముఖ్యంగా సాగునీటి ప్రాజెక్టుల సాధనకు మరియు అన్నదాతల శ్రేయస్సుకు శ్రీ రాజగోపాల్ రెడ్డి చేసిన నిస్వార్థ ప్రజాసేవ చిరస్మరణీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వారి కుటుంబ సభ్యులు, కార్యకర్తలు చిట్టిబోయిన సుబ్బరాయుడు యాదవ్. పాలకొండ చైర్మన్ రెడ్డయ్య యాదవ్. తదితరులు పాల్గొన్నారు.

# కుష్టు వ్యాధిని ముందుగానే గుర్తించి వైకల్యాలను నివారిద్దాం



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి సెప్టెంబర్ 18:**-కుష్టు వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి, సకాలంలో చికిత్స అందించడం ద్వారా అంగవైకల్యాలను నివారించవచ్చని ఉప జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ గీత తెలిపారు. కుష్టు వ్యాధి కేసుల గుర్తింపు ప్రచార కార్యక్రమం (ఎల్‌సీడీసీ)లో భాగంగా డ్రైవర్ కొట్టాల ప్రాంతంలో నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలకు కుష్టు వ్యాధి లక్షణాలు, చికిత్సపై అవగాహన కల్పించారు. సెప్టెంబర్ 11 నుంచి 24వ తేదీ వరకు ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి అనుమానిత కేసులను గుర్తిస్తారని తెలిపారు. చర్మంపై స్పర్శ తెలియని తెలుపు లేదా ఎరుపు రంగు మచ్చలు, మచ్చల వద్ద స్పర్శ తగ్గడం, చేతులు, కాళ్లలో తిమ్మిరి, నరాలు మందంగా అనిపించడం వంటి లక్షణాలు ఉంటే వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. కుష్టు వ్యాధి పూర్తిగా నయం చేయగలదని, ప్రజలు అపోహలను వీడి ఆరోగ్య సిబ్బందికి సహకరించాలని కోరారు. బాధితులపై వివక్ష చూపకుండా వారికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఎంఓ శివశంకరయ్య, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, హెల్త్ అసిస్టెంట్ జయపాల్, సీఓ నాగజ్యోతి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# సమాజ శ్రేయస్సు కోసమే 'డయల్ 1930' సినిమా

### - సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన కల్పించడమే లక్ష్యం: హీరో అర్జున్ రెడ్డి




**కడప మన జనప్రగతి సెప్టెంబర్ 18:**-సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు, మోసాలకు గురికాకుండా చైతన్యం తీసుకురావాలనే ఉద్దేశంతో 'డయల్ 1930' చిత్రాన్ని రూపొందించినట్లు చిత్ర హీరో అర్జున్ రెడ్డి తెలిపారు. శుక్రవారం వైఎస్ఆర్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.ప్రస్తుతం సమాజంలో సైబర్ నేరాలు పెరుగుతున్నాయని అర్జున్ రెడ్డి తెలిపారు. కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసి తాము పోలీసులమని, తమ బంధువులు గంజాయి లేదా డ్రగ్స్ కేసుల్లో పట్టుబడ్డారని చెప్పి భయపెట్టి డబ్బులు జమ చేయాలని బెదిరిస్తున్నారని పేర్కొన్నారు. నిజానిజాలు తెలుసుకోకపోవడంతో పలువురు మోసపోతున్నారని తెలిపారు.అదేవిధంగా యువతుల ప్రైవేట్ వీడియోలు తమ వద్ద ఉన్నాయని, వాటిని తొలగించాలంటే డబ్బులు చెల్లించాలని బెదిరిస్తూ సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని అన్నారు. ఇలాంటి ఘటనలతో బాధితులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని, కొన్ని సందర్భాల్లో ఆత్మహత్యలకు కూడా పాల్పడుతున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయని తెలిపారు.ఈ అంశాలను దృష్టిలో ఉంచుకుని సంబంధిత చట్టాలు, పోలీసుల సూచనలు, ఫోరమ్‌లు, నివేదికలను పరిశీలించి సమాజ శ్రేయస్సు కోసం 'డయల్ 1930' చిత్రాన్ని రూపొందించినట్లు అర్జున్ రెడ్డి తెలిపారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించే ఈ చిత్రాన్ని ప్రతి ఒక్కరూ వీక్షించాలని కోరారు. ప్రభుత్వం కూడా చిత్రాన్ని పరిశీలించి ప్రజలకు మరింత ఉపయోగపడేలా ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు.దర్శకుడు రంగనాథ్ ముత్యాల, నిర్మాత రమానీలం, జబర్దస్త్ ఫేమ్ హీరోయిన్ సత్యశ్రీ తదితరుల సహకారంతో 'డయల్ 1930' చిత్రాన్ని రూపొందించినట్లు అర్జున్ రెడ్డి తెలిపారు.

# 80 శాతం రాయితీ పై ఉలవ విత్తనాలు: ఏవో నాగమణి



**రామాపురం మన జనప్రగతి సెప్టెంబర్ 18:**-రామాపురం మండలానికి 80 శాతం రాయితీ పై 350 క్వింటాళ్ల ఉలవ విత్తనాలు మంజూరయ్యాయనీ అర్హులైన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలనీ రామాపురం మండల టిడిపి అధ్యక్షుడు గాలివీటి సురేంద్ర రెడ్డి రైతులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం చిట్లూరు గ్రామంలోని రైతు సేవ కేంద్రంలో ఉలవ విత్తనాల పంపిణీ ప్రారంభించారు విత్తనాలు పొందా లనుకునే రైతులు ఆధార్ కార్డ్, పట్టాదార్ పాస్ పుస్తకం, ఆధార్ కు ఫోన్ నెంబర్ లింక్ అయిన ఫోను తీసుకొని వచ్చి రైతు సేవా కేంద్రంలో నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. మండల వ్యవసాయ అధికారి వై నాగమణి మాట్లాడుతూ రవి సీజన్ సంబంధించిన వర్షాధారపటానికి ఉలవలు ప్రతి రైతు వినియోగించుకొని చేలలో విత్తుకోవాలని ఆమె సూచించారు. 10 కేజీల విత్తనం ధర 840 విత్తనాల పూర్తి ధర 740 రుపాయిలు రాయితీ 592 రైతువాట 148 రుపాయి చెల్లించాలని ఆమె తెలిపారు . ఈ కార్యక్రమంలో రైతు సేవా సిబ్బంది గ్రామ నాయకులు రైతులు పాల్గొన్నారు.

# 20న 'డి-స్టార్ట్' స్కాలర్‌షిప్ పరీక్ష



**హైదరాబాద్ మన జనప్రగతి సెప్టెంబర్ 18:**-దీక్ష జూనియర్ కాలేజీ ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీన "డి-స్టార్ట్ పేరుతో స్కాలర్‌షిప్ పరీక్ష నిర్వహించనున్నట్లు కళాశాల డైరెక్టర్లు రాజు మరియు ప్రభాకర్ తెలిపారు. ప్రస్తుతం 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఈ పరీక్ష ఒక మంచి అవకాశమని వారు పేర్కొన్నారు.ఈ పరీక్షలో మెరుగైన ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు 10వ తరగతి నుంచే స్కాలర్‌షిప్ అందించడంతో పాటు, ఇంటర్మీడియట్ రెండు సంవత్సరాల చదువుకు కూడా ఆర్థిక సహాయం కల్పించనున్నట్లు తెలిపారు. ఇతర సంస్థలు అందించని విధంగా ముందుగానే స్కాలర్‌షిప్ అవకాశాన్ని అందించడం ప్రత్యేకతగా నిలుస్తుందని పేర్కొన్నారు.అందువల్ల 10వ తరగతి చదువుతున్న విధ్యార్థిని విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని, విరివిగా పాల్గొని మంచి ఫలితాలు సాధించి స్కాలర్‌షిప్ పొందాలని కోరారు. విధ్యార్థిని విద్యార్థుల భవిష్యత్ విద్యాభివృద్ధికి ఈ పరీక్ష ఎంతో దోహదపడుతుందని వారు ఆకాంక్షించారు.

# ప్రొద్దుటూరులో మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం

### • అధికారులను అప్రమత్తం చేసిన ఎమ్మెల్యే




**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి సెప్టెంబర్ 18:**-ప్రొద్దుటూరు మండలం పరిధిలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది.ఈ సమావేశానికి ప్రొద్దుటూరు శాసనసభ్యులు నంద్యాల వరదరాజుల రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సమావేశంలో భాగంగా ముందుగా రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం తరపున సబ్సిడీ ద్వారా అందించే మినుములను అర్హులైన రైతులకు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి స్వయంగా అందజేశారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ఎల్ నినో ప్రభావం కారణంగా వర్షాలు పడనందున, గ్రామాలలో పశువులకు ఎలాంటి నీటి కొరత తలెత్తకుండా అధికారులు తక్షణ ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అలాగే, అన్ని గ్రామాలలో ప్రజలకు సరిపడేంత తాగునీరు అందుబాటులో ఉండేలా ప్రత్యేక పర్యవేక్షణ చేయాలని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాలలో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేయాలని చెప్తూ.. పెండింగ్‌లో ఉన్న రోడ్లు మరియు కాలువల నిర్మాణ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సూచించారు.వేసవిని దృష్టిలో ఉంచుకుని ఎటువంటి విద్యుత్ కొరత లేకుండా నిరంతరం సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆయన గట్టిగా ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు ఎంపీడీవో సూర్యనారాయణ రెడ్డి, ఎమ్మార్వో ఉదయ భాస్కర్ రాజు, మార్కెట్ కమిటీ ఇంచార్జ్ చైర్మన్ పట్నం లక్ష్మణ్ కుమార్, వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు మరియు స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# బీసీల చైతన్యమే లక్ష్యం..

### • బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి వై.సునీత


### • 34 శాతం రిజర్వేషన్లకు మంత్రివర్గ ఆమోదంపై హర్షం



**రాయచోటి మన జనప్రగతి సెప్టెంబర్ 18:**-స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కూటమి ప్రభుత్వం మంత్రివర్గంలో ఆమోదం తెలపడాన్ని స్వాగతిస్తూ రాయచోటి పట్టణంలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కృతజ్ఞతా ర్యాలీ నిర్వహించారు. బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి వై. సునీత ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి బీసీ వర్గాల నుంచి విశేష స్పందన లభించింది.ఈ సందర్భంగా ప్రముఖ న్యాయవాది టి. ఈశ్వర్ మాట్లాడుతూ, జనాభాలో 50 శాతానికి పైగా ఉన్న బీసీలకు జనాభా ప్రాతిపదికన ప్రాతినిధ్యం కల్పించడం వారి హక్కు అని అన్నారు. రిజర్వేషన్లు యాచించాల్సిన అవసరం లేదని, రాజ్యాంగం కల్పించిన హక్కుగా వాటిని సాధించుకోవాలని పేర్కొన్నారు.బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి సునీత మాట్లాడుతూ, బీసీలు ఐక్యంగా పోరాడితేనే తమ హక్కులను సాధించుకోగలమనే చైతన్యం ప్రజల్లో పెరుగుతోందన్నారు. బీసీలలో చైతన్యం తీసుకురావడమే తమ లక్ష్యమని తెలిపారు.ఏపీ వడ్డెర విద్యావంతుల వేదిక రాష్ట్ర కన్వీనర్ కె. జీవానందం మాట్లాడుతూ, బీసీ రక్షణ చట్టాన్ని అమలు చేయడంతో పాటు, బీసీలకు 50 ఏళ్లకే పింఛన్ ఇస్తామన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హామీని త్వరగా అమలు చేయాలని కోరారు.గాండ్ల కార్పొరేషన్ మాజీ రాష్ట్ర డైరెక్టర్ మల్లూరు రెడ్డివర ప్రసాద్ మాట్లాడుతూ, తమిళనాడులో 69 శాతం రిజర్వేషన్లు అమలవుతున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లో 34 శాతం రిజర్వేషన్లకు న్యాయపరమైన అడ్డంకులు ఎందుకు రావాలని ప్రశ్నించారు. సుప్రీంకోర్టు తీర్పులకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో జిల్లా రజక సంఘం అధ్యక్షుడు రమేష్ బాబు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, కుమ్మర సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర, వడ్డెర సంఘం నాయకులు వి.వి. రమణ, తొగటవీర క్షత్రియ సంఘం నాయకుడు పల్లా నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన ప్రజానేత రాజగోపాల్ రెడ్డి

### • ఘనంగా 13వ వర్ధంతి కార్యక్రమం.. • నివాళులర్పించిన వాసుదేవ రెడ్డి (వాసు)



**రామాపురం మన జనప్రగతి సెప్టెంబర్ 18:**-దివంగత మాజీ మంత్రి రెడ్డెప్పగారి రాజగోపాల్ రెడ్డి ప్రజల కోసం అంకితభావంతో సేవలందించి, వారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన ప్రజానేత అని కడప నియోజకవర్గ టీడీపీ యువ నాయకుడు రెడ్డెప్పగారి వాసుదేవ రెడ్డి (వాసు) అన్నారు. రాజగోపాల్ రెడ్డి 13వ వర్ధంతి సందర్భంగా రామాపురం మండలం హసనాపురం గ్రామంలోని చింతలవాండ్లపల్లెలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.శ్రీ ప్రభాకర్ ఇండియన్ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ సి.వి. సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వాసుదేవ రెడ్డి మాట్లాడుతూ.. పేదలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం రాజగోపాల్ రెడ్డి విశేషంగా కృషి చేశారని గుర్తుచేశారు. అహింసావాదిగా, ప్రజల సమస్యలను తన సమస్యలుగా భావించి వాటి పరిష్కారం కోసం నిరంతరం కృషి చేసిన నాయకుడిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు.ఐదుసార్లు ఎమ్మెల్యేగా, రెండుసార్లు మంత్రిగా ప్రజలకు సేవలందించిన రాజగోపాల్ రెడ్డి రాయచోటి ప్రాంత అభివృద్ధిలో తనదైన ముద్ర వేశారని తెలిపారు. ముఖ్యంగా వెలిగల్లు తదితర ప్రాజెక్టుల రూపకల్పనలో ఆయన కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు.పదవులు, రాజకీయ హోదాల కంటే ప్రజాసేవకే ప్రాధాన్యతనిస్తూ పనిచేసిన రాజగోపాల్ రెడ్డి ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని వాసు అన్నారు. ఆయన భౌతికంగా దూరమైనప్పటికీ ప్రజల కోసం చేసిన సేవలు, ప్రాంత అభివృద్ధికి చేసిన కృషి ప్రజల జ్ఞాపకాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు.కార్యక్రమంలో కడప ఎమ్మెల్యే రెడ్డెప్పగారి మాధవి, టీడీపీ నాయకులు, మాజీ మార్కెట్ చైర్మన్ మతిరేవుల రమేష్ రెడ్డి, భవనం వెంకటరామిరెడ్డి, సి.వి. సుబ్బారెడ్డి, సుబ్బరాయుడు, పిచ్చిరెడ్డి తదితర నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని రాజగోపాల్ రెడ్డికి ఘనంగా నివాళులర్పించారు.

# రాజగోపాల్ రెడ్డి సేవలు చిరస్మరణీయం

- వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి
- వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు..విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు



**రామాపురం మన జనప్రగతి సెప్టెంబర్ 18:**-దివంగత మాజీ మంత్రి రెడ్డెప్పగారి రాజగోపాల్ రెడ్డి ప్రజల కోసం అంకితభావంతో సేవలందించి ప్రజల మనసుల్లో శాశ్వత స్థానం సంపాదించుకున్న ప్రజానేతగా నిలిచిపోయారని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి, హిందూపురం పరిశీలకులు రెడ్డెప్పగారి రమేష్ కుమార్ రెడ్డి అన్నారు. రాజగోపాల్ రెడ్డి 13వ వర్ధంతి సందర్భంగా రామాపురం మండలం హసనాపురం గ్రామంలోని గొల్లపల్లెలో నిర్వహించిన కార్యక్రమంలో వారు పాల్గొని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేదలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం రాజగోపాల్ రెడ్డి విశేషంగా కృషి చేశారని వారు గుర్తుచేశారు. ఐదుసార్లు ఎమ్మెల్యేగా, రెండుసార్లు మంత్రిగా పనిచేసిన ఆయన రాయచోటి ప్రాంత అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. ముఖ్యంగా వెలిగల్లు తదితర ప్రాజెక్టుల రూపకల్పనలో ఆయన కృషి మరువలేనిదన్నారు.రాజగోపాల్ రెడ్డి వర్ధంతి సందర్భంగా కొండావాండ్లపల్లె ఉన్నత పాఠశాలలో విద్యార్థులను ప్రోత్సహించే కార్యక్రమం నిర్వహించారు. పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల వారీగా నగదు బహుమతులు అందజేశారు. విద్యార్థులు చదువులో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని గడికోట శ్రీకాంత్ రెడ్డి, రమేష్ కుమార్ రెడ్డి ఆకాంక్షించారు.


# హోమియోపతి పట్ల అవగాహనతో మెరుగైన ఆరోగ్యం




**కడప మన జనప్రగతి సెప్టెంబర్ 18:**-కడపలోని ఎస్.కే.ఆర్ అండ్ ఎస్.కే.ఆర్ స్వయంప్రతిపత్తి మహిళా డిగ్రీ కళాశాల బాటనీ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు హోమియోపతి అవేర్నెస్ ఫర్ బెటర్ హెల్త్, నాట్ స్ట్రెస్ అండర్ టెన్షన్ ఓన్లీ అటెన్షన్ అనే అంశంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సుగవాసి స్మిత మాట్లాడుతూ..ఎలాంటి దుష్ప్రభావాలు (సైడ్ ఎఫెక్ట్స్) లేని హోమియోపతి వైద్యం వ్యాధులను మూలాల నుండి నయం చేస్తూ, ప్రస్తుత కాలంలో వాడుకలో ఉన్న అల్లోపతి ఇతర వైద్య విధానాల కంటే ఎంతో శ్రేష్ఠమైనదని పేర్కొన్నారు.అనంతరం బాటనీ విభాగాధిపతి డాక్టర్ పి.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. హోమియోపతి ఔషధాలను వివిధ రకాల మొక్కల వేర్లు, పత్రాలు, కాండము, బెరడు మరియు విత్తనాల నుండి సంగ్రహించి వ్యాధుల నివారణకు విరివిగా ఉపయోగిస్తారని వివరించారు. ముఖ్య వక్తగా విచ్చేసిన కడప పాత రిమ్స్ ప్రభుత్వ హోమియోపతి ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ పి.షాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ..హోమియోపతి వైద్యాన్ని మొదట డాక్టర్ క్రిస్టియన్ ఫ్రెడరిక్ శామ్యూల్ హానెమన్ కనుగొన్నారని, మానవ స్వరూప శాస్త్రం ఆధారంగా ఆరోగ్యవంతులైన మానవులపై నిరూపించబడిన ఈ విధానంలో ఎలాంటి దుష్ప్రభావాలు ఉండవని, అందువల్లే నేటికీ ఇది ఎంతో సమర్థవంతంగా కొనసాగుతోందని తెలిపారు. ముఖ్యంగా మహిళల్లో వచ్చే డిస్మెనోరియా, అమెనోరియా,, గర్భాశయ ఫైబ్రాయిడ్లు, అండాశయ తిత్తులు, కణితులకు అనుబంధ చికిత్సగా,అలాగే ల్యూకోరియా,మెనోపాజ్ సమస్యలు,ఆర్థరైటిస్ వంటి తీవ్ర రుగ్మతలకు ఇది నమ్మకమైన పరిష్కారమని,శారీరక రోగాలను నయం చేయడమే కాకుండా మానసిక స్థిరత్వాన్ని కూడా పెంపొందిస్తుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఇంటర్న్ వైద్యులు డాక్టర్ హేమంత్, డాక్టర్ స్నేహ, డాక్టర్ అనూష, డాక్టర్ మానసలు ప్రదర్శించిన చక్కటి రోల్ ప్లే అందరినీ ఎంతగానో ఆకట్టుకుంది.అనంతరం కళాశాల విద్యార్థులు, టీచింగ్,నాన్-టీచింగ్ సిబ్బందితో కలిపి మొత్తం 1,967 మందికి ఉచితంగా హోమియోపతి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గణిత శాస్త్ర అధ్యాపకులు స్వరూప, వృక్షశాస్త్ర అధ్యాపకులు అనురాధ, రాజేశ్వరి, తెలుగు అధ్యాపకులు విజయలక్ష్మి, భౌతికశాస్త్ర అధ్యాపకులు పకార్ దిన్, పొలిటికల్ సైన్స్ అధ్యాపకులు సుబ్బారెడ్డి, ఉమెన్ ఎంపవర్మెంట్ కన్వీనర్ జయంతి తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ తీగలు తగిలి ఎక్స్ ఆర్మీ కేశవరెడ్డి మృతి

- పొలంలో మోటార్ వేసేందుకు వెళ్లిన సమయంలో ప్రమాదం
- దేశానికి సేవలందించిన ఎక్స్ ఆర్మీకి విషాదాంతం
- కుటుంబాన్ని విషాదంలో ముంచిన ఘటన





**వేముల మన జనప్రగతి సెప్టెంబర్ 18:-** వేముల మండలం దుగ్గన్నగారిపల్లెలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. వ్యవసాయ పొలంలో మోటార్ వేసేందుకు వెళ్లిన 46 ఏళ్ల ఎక్స్ ఆర్మీ రాజుల కేశవరెడ్డి విద్యుత్ తీగలు తగలడంతో తీవ్ర విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందారు. శుక్రవారం జరిగిన ఈ ఘటనతో దుగ్గన్నగారిపల్లెలో విషాదఛాయలు అలుముకున్నాయి. దుగ్గన్నగారిపల్లెకు చెందిన రాజుల కేశవరెడ్డి భారత సైన్యంలో విధులు నిర్వహించి పదవీ విరమణ పొందారు. దేశ రక్షణలో కొన్నేళ్లపాటు సేవలందించిన ఆయన పదవీ విరమణ అనంతరం స్వగ్రామంలోనే ఉంటూ వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. అయితే వ్యవసాయ పనుల్లోనే అనూహ్యంగా విద్యుత్ ప్రమాదానికి గురై ప్రాణాలు కోల్పోవడం కుటుంబ సభ్యులను తీవ్ర విషాదంలోకి నెట్టింది.ఈ క్రమంలో శుక్రవారం తన వ్యవసాయ పొలంలో మోటార్ వేసేందుకు వెళ్లారు. మోటార్ వేసే సమయంలో విద్యుత్ తీగలు తగలడంతో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థులు ఘటనాస్థలికి చేరుకున్నారు.అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వేంపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేశవరెడ్డి మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న ఆయన మృతితో భార్య అరుణకు మారి, కుమారుడు హితోయాష్‌రెడ్డి (బీటెక్ ప్రథమ సంవత్సరం), కుమార్తె మహతి (ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం) కన్నీరుమున్నీరుగా విలపించారు.ప్రమాదానికి గల పూర్తి కారణాలు, విద్యుత్ తీగల పరిస్థితిపై పోలీసులు, సంబంధిత అధికారులు వివరాలు సేకరిస్తున్నట్లు తెలిసింది. ఈ ఘటనపై కేసు నమోదు, తదుపరి చర్యలకు సంబంధించిన వివరాలు తెలియాల్సి ఉంది.

# సోలార్ రూఫ్‌టాప్‌తో విద్యుత్ ఆదా,కరెంటు బిల్లులకు చెక్: ఈఈ నాగేంద్ర ప్రసాద్

- పీఎం సూర్య ఘర్ యోజనపై అవగాహన సదస్సు
- రూ. 78,000 వరకు ప్రభుత్వ రాయితీ పొందే అవకాశం




**పులివెందుల అర్బన్ మన జనప్రగతి సెప్టెంబర్ 18:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన' పథకం ద్వారా విద్యుత్ వినియోగదారులు సోలార్ రూఫ్‌టాప్ ప్లాంట్లను ఏర్పాటు చేసుకుని భారీగా కరెంటు బిల్లులను ఆదా చేసుకోవచ్చని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ) నాగేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు.పట్టణంలో నిర్వహించిన 'సేవా సేతు' అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోలార్ పలకలు అమర్చుకోవడం వల్ల పర్యావరణానికి మేలు కలగడమే కాకుండా విద్యుత్ ఖర్చులు గణనీయంగా తగ్గుతాయన్నారు.కేంద్ర ప్రభుత్వం ఈ పథకం కింద వినియోగదారులకు 1 కిలోవాట్ సామర్థ్యానికి రూ.30,000 రాయితీ,2 కిలోవాట్ల సామర్థ్యానికి రూ.60,000 రాయితీ,3 కిలోవాట్లు అంతకంటే ఎక్కువ సామర్థ్యానికి గరిష్ఠంగా రూ.78,000 వరకు రాయితీ కల్పిస్తోందని వివరించారు.గృహ వినియోగదారులు తమ ఇంటి డాబాలపై సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసుకుని ప్రభుత్వం అందించే రాయితీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏడీఈలు గురు మోహన్ రెడ్డి,సుధాకర్ రెడ్డి,ఏఈ రమేష్ రెడ్డి,స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా టౌన్ బ్రాంచ్ మేనేజర్ విజయకుమార్,విద్యుత్ శాఖ సిబ్బంది మరియు స్థానిక వినియోగదారులు పాల్గొన్నారు.

# మిషన్ కర్మయోగిలో శిక్షణ సంస్థల ఆధునీకరణకు కార్యశాలలు

- సెప్టెంబర్ 29, 30న విజయవాడలో తొలి 'సాధన శృంఖల' సదస్సు



**విజయవాడ, మన జనప్రగతి సెప్టెంబర్ 18:-** మిషన్ కర్మయోగిలో భాగంగా శిక్షణ సంస్థలను నైపుణ్య ఆధారిత సామర్థ్య నిర్మాణ కేంద్రాలుగా అభివృద్ధి చేసేందుకు కెపాసిటీ బిల్డింగ్ కమిషన్ (సీబీసీ) 'సాధన శృంఖల 2026' పేరుతో ప్రాంతీయ కార్యశాలలను నిర్వహించనుంది. తొలి కార్యశాల సెప్టెంబర్ 29, 30 తేదీల్లో విజయవాడలో జరగనుంది.ఈ సదస్సుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ హాజరుకానున్నారు. ఏపీతో పాటు తెలంగాణ, కర్ణాటక, ఒడిశా, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి రాష్ట్రాలకు చెందిన అధికారులు, శిక్షణ సంస్థల ప్రతినిధులు పాల్గొంటారు.శిక్షణ సంస్థలను ఆధునీకరించి వ్యూహాత్మక, నైపుణ్య ఆధారిత సామర్థ్య నిర్మాణ కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు 'శిక్షణ సంస్థల రూపాంతర ఫ్రేమ్‌వర్క్'ను రూపొందిస్తున్నట్లు సీబీసీ తెలిపింది. ఇందులో సంస్థాగత పాలన, నాయకత్వం, ఫ్యాకల్టీ నైపుణ్యాభివృద్ధి, డిజిటల్ సాంకేతికత వినియోగం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు.ఈ ప్రక్రియకు UNNATI పోర్టల్ డిజిటల్ వేదికగా పనిచేయనుంది. ఇప్పటికే 700కు పైగా శిక్షణ సంస్థలు ఈ ప్లాట్‌ఫారమ్‌కు అనుసంధానమైనట్లు సీబీసీ పేర్కొంది. విజయవాడ కార్యశాల అనంతరం ప్రాంతీయ సంప్రదింపులను దేశంలోని ఇతర ప్రాంతాలకు విస్తరించి, సూచనల ఆధారంగా ఫ్రేమ్‌వర్క్‌కు తుది రూపు ఇవ్వనున్నారు.

# ఈనెల 22తో ముగియనున్న 'ఈ-పంట' నమోదు గడువు

- రైతులందరూ ఆర్బీకేల్లో బయోమెట్రిక్ వేసి ఈ-కేవైసీ ప్రక్రియను పూర్తి చేయాలి
- సింహాద్రిపురం ఏవో రామాంజులు రెడ్డి

**సింహాద్రిపురం మన జనప్రగతి సెప్టెంబర్ 18:-** ఖరీఫ్-2026 సీజన్‌కు సంబంధించి రైతులు సాగు చేసిన పంటల నమోదు గడువు ఈనెల 22వ తేదీతో ముగియనుందని మండల వ్యవసాయ అధికారి (ఏవో) ఏ.వి.రామాంజులు రెడ్డి తెలిపారు.మండల పరిధిలోని రైతులందరూ వెంటనే తమ సమీప రైతు సేవా కేంద్రాలను సందర్శించి వివరాలు సరిచూసుకోవాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు. పంట సాగు చేసిన రైతులు సంబంధిత రైతు సేవా కేంద్రం సిబ్బందిని సంప్రదించి, 'ఈ-పంట' జాబితాలో పేర్లు నమోదయ్యాయో లేదో నిర్ధారించుకోవాలని,జాబితాలో పేర్లు ఉన్న రైతులందరూ ఆర్బీకేల్లో బయోమెట్రిక్ వేసి ఈ-కేవైసీ ప్రక్రియను తక్షణమే పూర్తి చేయాలన్నారు.ఉచిత పంటల బీమా (క్రాప్ ఇన్సూరెన్స్),రాయితీ ఎరువులు,ప్రభుత్వం ద్వారా మద్దతు ధరకు పంట ఉత్పత్తుల కొనుగోలు వంటి సంక్షేమ ఫలాలు అందాలంటే ఈ-పంట నమోదు అత్యంత ఆవశ్యకం అని పంట సాగు చేసి ఇప్పటివరకు నమోదు చేసుకోని రైతులు నిర్లక్ష్యం చేయకుండా ఈనెల 22వ తేదీలోగా రైతు సేవా కేంద్రాల వద్ద నమోదుతో పాటు ఈ-కేవైసీ ప్రక్రియను ముగించుకోవాలని ఏవో స్పష్టం చేశారు.

# స్థానిక సంస్థల ఎన్నికల విజయాలే 2029 ఎన్నికలకు పునాది రాళ్లు



**పత్తికొండ మన జనప్రగతి సెప్టెంబరు 18:**-తుగ్గలి మండలం జొన్నగిరి గ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల స్థాయి కార్యకర్తల విస్తృత సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశానికి కర్నూలు పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి బుట్టా రేణుక, పత్తికొండ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ హాజరై పార్టీ శ్రేణులను ఉద్దేశించి ప్రసంగించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయాలు సాధించడం 2029 సార్వత్రిక ఎన్నికలకు పార్టీకి బలమైన పునాది అవుతుందని అన్నారు. గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎన్నికల సమయంలో చిన్నచిన్న విభేదాలను పక్కనపెట్టి పార్టీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై ప్రజల్లో చర్చ జరగాలని, ప్రజా సమస్యలను బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ప్రతి గ్రామంలో పార్టీని పటిష్టం చేయడం ద్వారా భవిష్యత్ ఎన్నికలకు కార్యకర్తలను సన్నద్ధం చేయవచ్చని తెలిపారు.అనంతరం పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, వివిధ విభాగాల కార్యకర్తలకు బుట్టా రేణుక, కంగాటి శ్రీదేవమ్మ ఐడీ కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తుగ్గలి మండలానికి చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన కుటుంబానికి అండగా ఉంటాం



**చిట్వేలి మన జనప్రగతి సెప్టెంబర్ 18:**-చిట్వేలి పట్టణం సింగనమల వీధికి చెందిన టంగుటూరి మస్తాన్, టంగుటూరి భారతి నివాసంలో గురువారం రాత్రి సుమారు 10:30 గంటల సమయంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం సంభవించింది. అగ్నిప్రమాదంలో వారి పూరిగుడిసె పూర్తిగా దగ్ధమై ఇంట్లోని సామగ్రి, ఆస్తి మొత్తం కాలిపోవడంతో కుటుంబం తీవ్రంగా నష్టపోయింది. విషాదకర ఘటనను తెలుసుకున్న రైల్వే కోడూరు నియోజకవర్గ టీడీపీ బాధ్యులు, కుడా చైర్మన్ ముక్కా రూపానంద రెడ్డి భార్య ముక్కా వరలక్ష్మి బాధిత కుటుంబాన్ని పరామర్శించి, వారికి అండగా నిలిచారు. ముక్కా రూపానంద రెడ్డి ఫౌండేషన్ తరఫున తక్షణ సహాయంగా రూ.50,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. రైల్వే కోడూరు శాసనసభ్యులు అరవ శ్రీధర్ బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరఫున నష్టపరిహారం అందించేలా చర్యలు తీసుకుంటామని, అలాగే ఇల్లు మంజూరు చేయించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఆపదలో ఉన్న కుటుంబానికి తక్షణ అండగా నిలిచి కష్టం వచ్చిన వేళ నేనున్నానంటూ భరోసా కల్పించిన ముక్కా రూపానంద రెడ్డి ఫౌండేషన్ కుటుంబానికి ఆత్మీయంగా అండగా నిలిచింది. ఎన్ డి ఏ కూటమి నాయుకులు పాల్గొన్నారు.

# వినాయక నిమజ్జనానికి పటిష్ట ఏర్పాట్లు

## - హై లెవెల్ వంతెన వద్ద భద్రత, ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు



**సిద్ధవటం మన జనప్రగతి సెప్టెంబరు 18:**-మండల కేంద్రమైన సిద్ధవటం హై లెవెల్ వంతెన వద్ద వినాయక విగ్రహాల నిమజ్జనానికి కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్లు ఒంటిమిట్ట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం సాయంత్రం వంతెన వద్ద ఏర్పాట్లను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ వివిధ ప్రాంతాల నుంచి నిమజ్జనానికి వచ్చే విగ్రహాల కోసం ప్రత్యేక యంత్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టడంతోపాటు రాత్రివేళ విద్యుత్ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. తల్లిదండ్రులు చిన్నారులను నిమజ్జన ప్రాంతానికి తీసుకురావద్దని సూచించారు. పెన్నా నదిలో నీటి ప్రవాహం పెరిగే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మొబైల్ ఫోన్లు, విలువైన వస్తువులను జాగ్రత్తగా భద్రపరుచుకోవాలని సూచించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఉత్సవాలకు ఎలాంటి ఆటంకం కలగకుండా అన్ని భద్రతా చర్యలు చేపట్టినట్లు సీఐ తెలిపారు. కార్యక్రమంలో స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

# మాధవరం-1లో ఉత్సాహంగా రంగవల్లుల పోటీలు

## - 35 మంది మహిళల పాల్గొనగా విజేతలకు బహుమతుల ప్రదానం



**సిద్దవటం మన జనప్రగతి సెప్టెంబరు 18:**-మాధవరం-1 గ్రామంలోని శ్రీ భద్రావతి భావనారాయణ, శ్రీ సీతారాముల దేవస్థానంలో కొలువుదీరిన వినాయకుని సన్నిధిలో శుక్రవారం మహిళలకు రంగవల్లుల పోటీలు ఉత్సాహంగా నిర్వహించారు. ఐదో రోజు వేడుకల్లో భాగంగా జరిగిన ఈ పోటీల్లో 35 మంది మహిళలు పాల్గొన్నారు. పోటీలో ప్రథమ బహుమతిని పుత్తా మల్లేశ్వరి, ద్వితీయ బహుమతిని బోగాబత్తిన సుబ్బమ్మ, తృతీయ బహుమతిని సుమలత గెలుచుకున్నారు. పి.ఆర్.బి. హ్యాండ్ లూమ్స్, సాయినగర్‌కు చెందిన పుత్తా బాబు సహకారంతో విజేతలకు బహుమతులు అందజేశారు. పోటీలో పాల్గొన్న ప్రతి మహిళకు ప్రోత్సాహక బహుమతులు అందించారు.

## శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు




**తొండూరు మన జనప్రగతి సెప్టెంబర్ 18:**–మండల పరిధిలోని శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత స్వామివారికి 17వ రోజు ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పూజారి నాగరాజ శర్మ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు స్వామివారికి అభిషేకాలు నిర్వహించి, ప్రత్యేక అలంకరణలు చేశారు. అనంతరం వేద మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తుల రాకతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. స్వామివారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, గ్రామంలో శాంతి, సౌభాగ్యం నెలకొనాలని భక్తులు ప్రార్థించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, అర్చకులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

## మూడేళ్ల కాలపరిమితికి మున్సిపల్ షాపుల వేలం

**సెప్టెంబర్ 28న నిర్వహణ**

**మున్సిపల్ కమిషనర్ శివ తనూజ**



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి సెప్టెంబర్ 18:**–పులివెందుల పురపాలక సంఘం పరిధిలోని వివిధ షాపింగ్ కాంప్లెక్స్‌లలో ఖాళీగా ఉన్న షాపు గదులను నెలవారీ అద్దె ప్రాతిపదికన కేటాయించేందుకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ శివ తనూజ తెలిపారు. గెజిట్ నం.33/2024,56/2024 నిబంధనల ప్రకారం మూడేళ్ల కాలపరిమితికి ఈ వేలం ప్రక్రియ చేపట్టనున్నారని ఈ నెల 28వ తేదీ (సోమవారం) సాయంత్రం 4:00 గంటలకు మున్సిపల్ కమిషనర్ సమక్షంలో వేలం జరుగుతుందని ఆసక్తి గల అభ్యర్థులు అదే రోజు మధ్యాహ్నం 12:00 గంటల లోపు పురపాలక సంఘ కార్యాలయంలో రూ 100 చెల్లించి దరఖాస్తు ఫారాలు పొందాల్సి ఉంటుందన్నారు. నియమ నిబంధనలు,ఖాళీ గదుల వివరాల కోసం వార్డు సచివాలయాలలోని వార్డు అడ్మిన్ సెక్రటరీలను గానీ, కార్యాలయ పనివేళల్లో (ఉదయం 10:00 నుండి సాయంత్రం 5:00 వరకు) నోటీస్ బోర్డును గానీ పరిశీలించవచ్చని పేర్కొన్నారు. తదుపరి వివరాల కోసం మున్సిపల్ రెవెన్యూ విభాగాన్ని సంప్రదించాలని అధికారులు సూచించారు.

## పిఎం కిసాన్ పథకానికి పార్మర్ ఐడి తప్పని సరి



**చిట్వేలి మన జనప్రగతి సెప్టెంబర్ 18:**–వచ్చే విడత పీఎం కిసాన్ రైతుల ఖాతా లో జమ కావడానికి ప్రతి రైతు ఏపీ ఎఫ్ఆర్ నందు పార్మర్ ఐడి తప్పనిసరిగా ఉండాలని చిట్వేలి మండల వ్యవసాయ అధికారి జి. సుధాకర్ తెలియజేశారు. శుక్రవారం వ్యవసాయ అధికారి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పీఎం కిసాన్ లబ్ధి పొందుతున్న ప్రతి రైతు మళ్ళీ ఈ – కేవైసి చేసుకొంటేనే ఖాతాలో డబ్బులు జమ అవుతాయన్నారు. పార్మర్ ఐడి లేనివారు మళ్ళీ ఈ – కేవైసి కొరకు తమ పరిధిలోని రైతుసేవా కేంద్రంలోని సిబ్బందిని సంప్రదించాలని కోరారు. పీఎం కిసాన్ ఈ– కేవైసి మీసేవ కేంద్రాలలోను, సీఎస్సి సెంటర్ లోను కూడా చేసుకోవచ్చని తెలిపారు. పీఎం కిసాన్ తోపాటు రైతులకు సంబంధించిన అన్ని పథకాలకు పార్మర్ ఐడి తప్పనిసరిగా ఉండాలన్నారు. పార్మర్ ఐడి కొరకు ఆధార్ జిరాక్స్, ఆధార్ లింక్డ్ మొబైల్, పట్టాధారు పాసుబుక్ తప్పనిసరిగా తీసుకెళ్లాలని వ్యవసాయ అధికారి సుధాకర్ రైతులకు తెలియ జేశారు.

## సైబర్ మోసాల పట్ల అప్రమత్తత అవసరం..యాప్ వలలో పడకండి

- అత్యవసరమైతేనే రుణాలు తీసుకోండి: క్రైమ్ సీఐ అంకబాబు



**కాకినాడ మన జనప్రగతి సెప్టెంబర్ 18:**–సైబర్ మోసాలు పట్ల యువత,మహిళలు అప్రమత్తంగా ఉండాలని సామర్లకోట క్రైమ్ సిఐ ఆర్ అంకబాబు సూచించారు. అత్యవసరమైతేనే రుణాలు తీసుకోవాలే గానీ సరదాగా రుణం ఫోన్లో యాప్ ద్వారా తీసుకునే అలవాటు మానుకోవాలని సిఐ హితవు పలికారు. శుక్రవారం సర్పవరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో ఎంఫిన్ ఆధ్వర్యంలో ఫ్యూజియన్ ఫైనాన్స్ లిమిటెడ్ కంపెనీ మైక్రో ఫైనాన్స్ అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సామర్లకోట సీఐ అంకబాబు మాట్లాడుతూ..తమ బ్యాంకు ఖాతా వివరాలను మరొకరికి ఇవ్వవద్దని సూచించారు. అలాగే కొన్ని సంస్థల నుంచి మాట్లాడుతున్నామంటూ ఓటీపీ, బ్యాంకు ఖాతా వివరాలు అడిగినా చెప్పవద్దన్నారు. గుర్తింపు లేని యాప్ల ద్వారా రుణాలు తీసుకోవద్దని అలా తీసుకుంటే చాలా ఇబ్బందులు ఎదురవుతారని చెప్పారు. చాలావరకు ఆన్లైన్ రుణాలు తీసుకోకుండా ఉండడమే మేలని హాజరైన వారికి అంకబాబు సూచించారు. పేద, మధ్య తరగతికి చెందిన ప్రజలు చాలా ఆశలతో జీవనం సాగిస్తారని వారిని గుర్తింపు లేని వారు అధిక వడ్డీలు,బహుమతులు పేరుతో ఆశ చూపి వాళ్లని అప్పులపాలు చేసి మోసాలకు పాల్పడుతుంటారన్నారు. అటువంటి తరహా మోసాలకు గురైతే 1930 నెంబరుకి ఫోన్ చేయాలని అంకబాబు చెప్పారు.ఎంఫిన్ ఉపాధ్యక్షుడు పి కమలేశ్ మాట్లాడుతూ..ఆన్లైన్ మోసాలు ఈ మధ్యకాలంలో పెరిగిపోయాయని అందువల్ల జాగ్రత్త వహించాలన్నారు. వివిధ రకాలుగా ఆశ చూపి మీ వద్ద నుండే వారు డబ్బును దోచేయటానికి ప్రయత్నిస్తున్నట్లు వివరించారు. లీడ్ బ్యాంక్ ప్రతినిధి శ్రీనివాస్ మాట్లాడుతూ పొదుపు చేసుకోవడం మహిళలు అలవాటు చేసుకుని ఆ నగదును బ్యాంకుల్లో జమ చేసుకొని ఆ కుటుంబాన్ని ఆర్థికంగా ఎదిగేందుకు వినియోగించుకోవాలని చెప్పారు. ఒకరి గురించి అప్పు చేసే విధానాన్ని మానుకొని తమ కుటుంబం ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ప్రయత్నం చేయాలని ఫ్యూజియన్ ఫైనాన్స్ ఆర్ఎం బి కిరణ్ కుమార్ సూచించారు. రిజర్వ్ బ్యాంక్ గుర్తింపు పొందిన సంస్థలు వినియోగదారులను ఇబ్బందులు కలిగించవని వాటి నుండే రుణాలు తీసుకోవాలని కిరణ్ కుమార్ కోరారు. ఆన్లైన్ మోసాలను జరిగిన తీరును సైబర్ క్రైమ్ డిపార్ట్మెంట్ తరుపున దుర్గాప్రసాద్ స్క్రీన్ పైన వివరించారు. ఈ కార్యక్రమంలో గంగిరెడ్డి బలరాం,ఫ్యూజియన్ క్లస్టర్ మేనేజర్ జివివి ప్రసాద్,ఇతర మైక్రో ఫైనాన్స్ సంస్థల ప్రతినిధులు ఎం రాఘవ నాయుడు, జి కృష్ణ, కే డేవిడ్, ఏ కొండబాబు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

## వినాయక విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు







**ఓబులవారిపల్లి మన జనప్రగతి సెప్టెంబర్ 18:**–రైల్వే కోడూరు నియోజకవర్గ పరిధిలోని ఓబులవారిపల్లి మండలం ఎస్.కొత్తపల్లి, రాఘవరాజపురం తదితర ప్రాంతాల్లో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు శుక్రవారం నిమజ్జనానికి తరలుతున్న వినాయక విగ్రహాల వద్ద టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి సతీమణి ముక్కా వరలక్ష్మి, టీడీపీ యువ నాయకులు ముక్కా సాయి వికాస్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణనాథుడి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో, సిరిసంపదలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని వారు ఆకాంక్షించారు. వినాయక నిమజ్జనం సందర్భంగా భక్తులు అప్రమత్తంగా ఉండాలని, జలాశయాలు, చెరువుల్లో నిమజ్జనం చేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో గణేష్ ఉత్సవాలను నిర్వహించుకోవాలని కోరారు. నిమజ్జనానికి తరలుతున్న విగ్రహాల వద్దకు వెళ్లి పూజలు నిర్వహించేందుకు ముక్కా వరలక్ష్మి, ముక్కా సాయి వికాస్‌రెడ్డి పలు ప్రాంతాల్లో పర్యటించారు. ప్రజలు ఆహ్వానించిన కార్యక్రమాలకు హాజరవుతూ వారితో మమేకమవుతున్నారని స్థానికులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు చంద్రరాజు, బత్తిన వేణుగోపాల్‌రెడ్డి, ప్రేమ్‌కుమార్‌తో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

## సబ్సిడీ ఉలవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

**- లక్కిరెడ్డిపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్ఎండి షఫీ నాయక్**

**రాయచోటి మన జనప్రగతి సెప్టెంబర్ 18:**–లక్కిరెడ్డిపల్లి టౌన్, దిన్నెపాడు గ్రామంలోని రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ ఉలవలను లక్కిరెడ్డిపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్ఎండి షఫీ నాయక్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన రైతులకు ప్రభుత్వం తక్కువ ధరకే నాణ్యమైన ఉలవలను సబ్సిడీపై అందిస్తోందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ యనమల మదన్ మోహన్, సింగిల్ విండో అధ్యక్షుడు అంబా బత్తిన రెడ్డయ్య, దేవారెడ్డి, శంకరప్ప జయరాం, కావలి ఆంజనేయులు, ముత్తారహ్మద్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



## కడప మేయర్ అభ్యర్థిత్వం కోరిన జనసేన జిల్లా కోఆర్డినేటర్

- మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కలిసిన సుంకర శ్రీనివాస్
- బయోడేటా,అభ్యర్థిత్వ ప్రతిపాదన సమర్పణ
- నగర ప్రజలకు చేరువగా పనిచేయడమే లక్ష్యమని వెల్లడి



**కడప మన జనప్రగతి సెప్టెంబర్ 18:**–రాబోయే కడప మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యక్ష మేయర్ ఎన్నికల్లో జనసేన పార్టీ తరఫున తన అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని కోరుతూ ఆ పార్టీ ఉమ్మడి కడప జిల్లా కోఆర్డినేటర్, కడప అసెంబ్లీ ఇన్‌చార్జి సుంకర శ్రీనివాస్ పార్టీ పీఏసీ చైర్మన్, రాష్ట్ర ఆహార, పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కోరారు. ఈ మేరకు శుక్రవారం తెనాలిలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో నాదెండ్ల మనోహర్‌ను సుంకర శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించారు. అనంతరం కూటమి పొత్తులో భాగంగా జనసేన పార్టీ తరఫున కడప మేయర్ అభ్యర్థిగా తన పేరును పరిశీలించాలని కోరుతూ బయోడేటా, అభ్యర్థిత్వ ప్రతిపాదనను అందజేశారు. కడప నగరంలో తనకు ఉన్న ప్రజా పరిచయాలు, ప్రజలతో అనుబంధంతో పాటు జనసేన పార్టీ బలోపేతానికి నిర్వహిస్తున్న కార్యక్రమాలను సుంకర శ్రీనివాస్ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. పార్టీ తరఫున అవకాశం కల్పిస్తే జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ నాయకత్వంలో పార్టీ శ్రేణులు, కూటమి నాయకులతో సమన్వయం చేసుకుంటూ ఎన్నికల్లో పనిచేస్తామని తెలిపారు. కడప నగర అభివృద్ధితో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం అందుబాటులో ఉండే నాయకత్వాన్ని అందించాలనే లక్ష్యంతో మేయర్ అభ్యర్థిత్వాన్ని కోరుతున్నట్లు సుంకర శ్రీనివాస్ పేర్కొన్నారు.

## అందరం కష్టపడదాం కోర్టు బిల్డింగ్ నిర్మించుకుందాం

**- న్యాయవాదులతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రామ్ గోపాల్**



**రాయచోటి మన జనప్రగతి సెప్టెంబర్ 18:**–రాయచోటి కోర్టు భవనాల నిర్మాణం కోసం ఎవరి వంతు వారు కష్టపడి త్వరగా కోర్టు భవనాల నిర్మాణాన్ని చేసుకుందామని కడప జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాంగోపాల్ అన్నట్లు రాయచోటి బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఎస్ లక్ష్మీదేవి, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు ఎన్ ప్రభాకర్ రెడ్డి అన్నారు. రాయచోటి కోర్టు బిల్డింగు విస్తీర్ణం గురించి బిల్డింగ్ నిర్మాణ పాత కోర్టు భవనాల స్థానం లో నిర్మించాడానికి ఉన్న సాధ్యాసాధ్యాల గురించి జిల్లా ప్రధాన న్యాయమూర్తితో వారు కలిసి చర్చించారు. అనంతరం రాయచోటి పాత కోర్టు బిల్డింగు స్థలం విస్తీర్ణం వివరాలను, రోడ్లు భవనాల శాఖ ప్రతిపాదనలను వారు జిల్లా జడ్జి గారికి సమర్పించారు. గత మూడు సంవత్సరాలుగా బాడుగ భవనాలలో కొనసాగుతున్నదని కోర్టు భవనాల నిర్మాణ ప్రతిపాదనే ఇంతవరకు జరగలేదని విషయంపై జిల్లా జడ్జి గారితో మాట్లాడినట్లు వారు తెలిపారు. బిల్డింగ్ నిర్మాణం కోసం ఎవరి పాత్ర ఎంత అవసరమో వారు వద్ద పనులు చేయిస్తామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాయచోటి బార్ అసోసియేషన్ ట్రెజరీర్ ఖుష్నుమా, న్యాయవాదులు ధనుంజయ్ కుమార్, ఆనంద్ కుమార్, ఈశ్వర్, నాగ ముని వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు

## పాత బస్టాండ్ చోరీ కేసు ఛేదింపు..ముగ్గురు అరెస్ట్..!

**- రూ.3.90 లక్షల విలువైన సొత్తు రికవరీ.**





**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి సెప్టెంబర్ 18:**– ప్రొద్దుటూరు పాత బస్టాండ్‌లో రద్దీని ఆసరాగా చేసుకుని మహిళ వద్ద నుంచి నాలుగు బంగారు గాజులను అపహరించిన కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి సుమారు రూ. 3.90 లక్షల విలువైన ఐదు తులాల బరువున్న నాలుగు బంగారు గాజులను స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్పీ విభూకృష్ణ తెలిపారు. శుక్రవారం స్థానిక ఏఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. ఈ నెల 12న బస్సు ఎక్కే సమయంలో చిలమకూరు గ్రామానికి చెందిన సారెడ్డి లక్ష్మీదేవి హ్యాండ్‌బ్యాగ్‌లోని పర్సులో భద్రపరిచిన నాలుగు బంగారు గాజులను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. దీనిపై మరుసటి రోజు అందిన ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఏఎస్పీ పర్యవేక్షణలో సీఐ డి. రామాంజనేయుడు ఆదేశాల మేరకు ఎస్సై టి. సంజీవరెడ్డి, ఏఎస్ఐ శ్రీరాముల సుబ్బన్న, పోలీసు సిబ్బంది సాంకేతిక ఆధారాలు, విశ్వసనీయ సమాచారంతో నిందితులను గుర్తించారు. శుక్రవారం సాయంత్రం వాసవి సర్కిల్ వద్ద ముగ్గురిని అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన వారిలో అన్నమయ్య జిల్లా గాలివీడు మండలం గోపన్నపల్లి గ్రామానికి చెందిన షేక్ కరమల్ల షబీనా అలియాస్ పఠాన్ షబీనా, పఠాన్ ముబీనా, పఠాన్ షాహిద్ ఖాన్ ఉన్నారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ రద్దీ ప్రదేశాల్లో మహిళలు, వృద్ధులు బంగారు ఆభరణాలు, నగదు, మొబైల్ ఫోన్లు, హ్యాండ్‌బ్యాగుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు, కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమావేశంలో సీఐ రామాంజనేయుడు, ఎస్సై సంజీవరెడ్డి, ఏఎస్ఐ సుబ్బన్న తదితరులు పాల్గొన్నారు.


# బీటెక్ రవికి పేకాట, మైనింగ్ మాఫియాపై ఉన్న శ్రద్ధ సాగునీటిపై లేదు

- రాయలసీమ జలాలపై మాట్లాడే నైతిక హక్కు టీడీపీకి లేదు
- పులివెందుల మున్సిపాలిటీని నిర్వీర్యం చేసిన కూటమి ప్రభుత్వం: వైఎస్సార్‌సీపీ నాయకుల ధ్వజం



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి సెప్టెంబర్ 28:**టీడీపీ ఎమ్మెల్సీ బీటెక్ రవికి పేకాట క్లబ్బులు,కోడి పందేలు,మైనింగ్ మాఫియా,తుపాకీ కాల్పులు,కాంట్రాక్టర్ల వద్ద కమీషన్లు వసూలు చేసుకోవడంపై ఉన్న అవగాహన ప్రాజెక్టులు,సాగునీటి రంగంపై లేదని వైఎస్సార్‌సీపీ నాయకులు ఎద్దేవా చేశారు.శుక్రవారం పులివెందులలోని వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ మాజీ కో-ఆప్షన్ సభ్యుడు చంద్రమౌళి,మాజీ కౌన్సిలర్స్ లక్ష్మీప్రసన్న, పార్నపల్లి కిషోర్,ఖాదర్ బాషాలు సంయుక్తంగా విలేకరుల సమావేశంలో మాట్లాడారు.పోలవరం,వెలిగొండ ప్రాజెక్టులు,రాయలసీమ జలాలపై బీటెక్ రవి అర్థం లేని విమర్శలు చేయడం హాస్యాస్పదమని నాయకులు మండిపడ్డారు.పోలవరం ఎత్తును కేంద్రం 41.15 మీటర్లకు పరిమితం చేస్తే ప్రశ్నించకుండా చంద్రబాబు సర్కార్ రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టిందని విమర్శించారు.గత వైఎస్ జగన్ ప్రభుత్వంలో కాఫర్ డ్యామ్,డయాఫ్రామ్ వాల్,స్పిల్ వే, పునరావాస పనులు యుద్ధప్రాతిపదికన జరిగాయని గుర్తు చేశారు.వైఎస్ జగన్ స్వయంగా ప్రధాని ముందే రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమని తేల్చిచెప్పారని,అసెంబ్లీ సాక్షిగా 45.72 మీటర్ల ఎత్తుతో పోలవరాన్ని నిర్మించి తీరుతామని ప్రకటించిన ఘనత వైఎస్ జగన్మోహన్ రెడ్డి దే అని స్పష్టం చేశారు.రాయలసీమ జలాలకు చంద్రబాబు చేసిన ద్రోహంపై సాక్షాత్తూ తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడిన మాటలకు బీటెక్ రవి ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు.అధికారంలో ఉండి కూడా రైతులకు సకాలంలో సాగునీరు అందించలేని అసమర్థత టీడీపీదని దుయ్యబట్టారు.శ్రీశైలం నుంచి గండికోట,చిత్రావతి ప్రాజెక్టులకు నీటిని విడుదల చేయకుండా కాలయాపన చేస్తూ,సీబీఆర్ వద్దకు వెళ్లి గేట్లు ఎత్తుదామని ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డిని పిలవడం బీటెక్ రవి బాధ్యతారాహిత్యానికి నిదర్శనమన్నారు.వైఎస్ జగన్,వైఎస్ అవినాష్ రెడ్డిలను విమర్శించే నైతిక హక్కు,స్థాయి బీటెక్ రవి కి లేదన్నారు.పులివెందులలో వైఎస్ జగన్ రూ.430 కోట్లతో అత్యాధునిక మెడికల్ కాలేజీని నిర్మిస్తే,కూటమి ప్రభుత్వం దాన్ని నిర్వీర్యం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.నేషనల్ మెడికల్ కౌన్సిల్ 50 సీట్లు మంజూరు చేస్తే వాటిని వెనక్కి పంపిన చరిత్ర ఈ ప్రభుత్వానిదని దుయ్యబట్టారు.కూటమి అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు దాటినా మున్సిపాలిటీకి ఒక్క రూపాయి నిధులు ఇవ్వలేదని,తాగునీటి మోటార్లు,వీధి దీపాలు లేక,చెత్త బండ్లకు డీజిల్ పోయించలేక పాలన కుంటుపడిందన్నారు.అధికారం లేకపోయినా ఎంపీ వై.ఎస్.అవినాష్ రెడ్డి ఎంపీ ల్యాడ్స్ నిధుల నుంచి దాదాపు రూ 3 కోట్ల వ్యయంతో ఎర్రగుడిపల్లె,రాజారెడ్డి కాలనీ,రింగ్ రోడ్డు సమీపంలోని న్యాక్ భవనం రోడ్డు వంటి ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టామని పేర్కొన్నారు.పులివెందుల మున్సిపాలిటీ కోసం ఇప్పటివరకు ఎంత ఖర్చు చేశారో ప్రభుత్వం వెంటనే శ్వేతపత్రశీ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ప్రస్తుతం పట్టణంలో ప్రజలకు కనీసం తాగునీరు,వీధి దీపాలు (స్ట్రీట్ లైట్లు) కూడా సరిగ్గా అందించలేని దుస్థితి ఉందని విమర్శించారు.కౌన్సిలర్లు,పార్టీ శ్రేణులు తమ సొంత నిధులతో వీధి దీపాలు ఏర్పాటు చేసుకునే పరిస్థితి వచ్చిందన్నారు.మున్సిపల్ ఎన్నికల్లో ప్రజాస్వామ్యబద్ధంగా గెలవాలనే ఉద్దేశం లేకుండా,అక్రమ మార్గాల్లో ఏదో చేయాలని చూస్తున్నారే తప్ప ప్రజలకు మేలు చేయాలనే ఆలోచన ప్రస్తుత పాలకులకు లేదని విమర్శించారు.ప్రశాంతమైన పులివెందులను తుపాకీ సంస్కృతి,పేకాట,కోడి పందేల స్థావరాలుగా మార్చిన ఘనత బీటెక్ రవిదేనని విమర్శించారు.అధికార గర్వంతో విద్యాబుద్ధులు నేర్పే గురువులను నడిరోడ్డుపై బెదిరించి ప్రజల ముందు నవ్వులపాలయ్యారని గుర్తు చేశారు.ఇప్పటికే పులివెందుల ప్రజలు బీటెక్ రవిని మూడుసార్లు తిరస్కరించారని,రాబోయే రోజుల్లో ఆయనకు,టీడీపీకి డిపాజిట్లు కూడా దక్కకుండా చేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. ప్రజాబలంతో ఎన్నికల్లో ఘన విజయం సాధించేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సర్వదా సిద్ధంగా ఉందని నాయకులు స్పష్టం చేశారు.

## వేంపల్లె డిగ్రీ కళాశాలలో రెండవ విడత అడ్మిషన్లు ప్రారంభం



**వేంపల్లె మన జనప్రగతి సెప్టెంబర్ 18:**–స్థానిక వైఎస్ఆర్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండో విడత అడ్మిషన్లు ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. ఉషశ్రీ తెలిపారు. 2026- 27 విద్యా సంవత్సరానికి సంబంధించి ఈ నెల 18 తేదీ నుంచి 21వ తేదీ వరకు ఫేస్-2 అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. ఇంటర్ ఉత్తర్నులై ఇప్పటివరకు డిగ్రీ అడ్మిషన్ పొందని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.తమ కళాశాలలో బి.ఏ,బి.కామ్,బి.ఎస్సీ,కెమిస్ట్రీ, మ్యాథ్స్, కంప్యూటర్ సైన్స్,కోర్సులకు రిజిస్ట్రేషన్, సర్టిఫికెట్ వెరిఫికేషన్, వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలన్నారు.ప్రవేశాల కోసం అవసరమైన సహాయం కోసం కళాశాల యాజమాన్యాన్ని సంప్రదించి అడ్మిషన్లు పొందాలని ఆమె తెలియజేశారు.

## శేష వాహనంపై శ్రీ రంగనాథ స్వామి



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి సెప్టెంబర్ 18**:శ్రీరంగనాథ స్వామి వారి నూలు పూజ ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామి వారు శేష వాహనంపై శ్రీదేవి భూదేవి సమేత కొలువుతీరి భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ అర్చకులు కృష్ణ రాజేష్ శర్మ, నరసింహస్వామి,ఫణి శర్మల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు ఉదయం స్వామివారికి యధావిధిగా అభిషేకాలు ప్రత్యేక పూజలు మూలవిరాట్ కు నిర్వహించారు.శేష వాహనంపై కొలువుతీరిన స్వామివారిని ఆలయ ఈవో కొట్టే రమణ,ఆలయ సిబ్బంది పురుషోత్తం,విజయ్,శ్రీ రంగనాథ ట్రస్ట్ సీఈఓ అల్లం రంగనాయకులు,ట్రస్టు ప్రతినిధులు తొలిసాకు సురేష్,ఆలమూరు రమేష్ తదితరులు దర్శించుకున్నారు. ఉబయదారులు,భక్తులు ఈ కార్యక్రమాల్లో పాల్గొని స్వామి వారి ఆశీస్సులతో పాటు తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## జిల్లా యువజన ఉత్సవాల్లో యువత ప్రతిభ చాటాలి: జిల్లా కలెక్టర్ డా.ఎ.సిరి



**కర్నూలు బ్యూరో మన జనప్రగతి సెప్టెంబర్ 18:**–జిల్లా స్థాయి యువజన ఉత్సవాల్లో యువత ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలని జిల్లా కలెక్టర్ డా. ఎ. సిరి పిలుపునిచ్చారు. జిల్లా యువజన సంక్షేమ శాఖసెట్కూరు ఆధ్వర్యంలో నిర్వహించనున్న యువజన ఉత్సవాల పోస్టర్‌ను శుక్రవారం ఆమె ఆవిష్కరించారు.కలెక్టర్ మాట్లాడుతూ..యువతలోని ప్రతిభ, సృజనాత్మకతను వెలికితీసేందుకు యువజన ఉత్సవాలు చక్కటి వేదికగా నిలుస్తాయని తెలిపారు. 15 నుంచి 29 సంవత్సరాల వయస్సు గల యువతీ యువకులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించాలని కోరారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని సూచించారు.సెట్కూరు సీఈఓ డా. కె. వేణుగోపాల్ మాట్లాడుతూ.. అక్టోబర్ 1న కర్నూలులోని అశోక మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో జిల్లా స్థాయి యువజన ఉత్సవాల పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జానపద నృత్యం, జానపద గీతం, నాటక్‌నుక్కడ్, పెయింటింగ్, కవితా రచన విభాగాల్లో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన విజేతలు రాష్ట్ర స్థాయి, రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన వారు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవుతారని తెలిపారు.విజేతలకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు, పోటీల్లో పాల్గొన్న వారికి పాల్గొనిన ధ్రువపత్రాలు అందజేస్తామని చెప్పారు. ఆసక్తి ఉన్న యువతీ యువకులు, బృందాలు https://bit.ly/knldyf26 ద్వారా ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోలేని వారు అక్టోబర్ 1న ఉదయం 8.30 గంటల్లోపు అశోక మహిళా ఇంజనీరింగ్ కళాశాలకు నేరుగా వచ్చి నమోదు చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 8328181581 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.జిల్లా అధికారిక వెబ్‌సైట్‌లో యువజన సంక్షేమ శాఖకు సంబంధించిన సీఈఓ సెట్కూరు వివరాలు కూడా అందుబాటులో ఉన్నాయి. పోటీలు నిర్వహించనున్న అశోక మహిళా ఇంజనీరింగ్ కళాశాల కర్నూలులోని ఎన్‌హెచ్44 సమీపంలో ఉన్నట్లు కళాశాల అధికారిక వెబ్‌సైట్‌లో పేర్కొంది.కార్యక్రమంలో జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి దీప్తి, ఇంటర్మీడియట్ బోర్డు రీజినల్ ఇన్‌స్పెక్షన్ ఆఫీసర్ లాలెప్ప, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతి రావు, సెట్కూరు సిబ్బంది శ్యామల, నిదీష్ కుమార్, శంకృబాయి పాల్గొన్నారు.

## విద్యుత్ ఘాత మృతుని కుటుంబీకునికి అండగా ఉంటాం

- పులివెందుల టిడిపి ఇన్చార్జ్ బీటెక్ రవి



**వేంపల్లె మన జనప్రగతి సెప్టెంబర్ 18:**–వేముల మండలం దుగ్గ న్న గారి పల్లె కు చెందిన విద్యుత్ ఘాత మృతుడు రాజుల కేశవరెడ్డి కుటుంబానికి అండగా ఉంటామని పులివెందుల టిడిపి ఇన్చార్జి బీటెక్ రవి పేర్కొన్నారు. వేంపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న విద్యుత్ ఘాతమృతుడు కేశవరెడ్డి మృతదేహాన్ని శుక్రవారం బిటెక్ రవి సందర్శించి వారి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఘటన జరిగిన తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. కేశవరెడ్డి మృతిపట్ల సంతాపం ప్రకటించిన ఆయన మృతుని కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటామని బీటెక్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో మండల తెదేపా పరిశీలకుడు అబ్బుగుట్టు రఘునాథరెడ్డి, తెదేపా నేత మా రెడ్డి భరత్ రెడ్డి, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షబ్బీర్, దిల్ మాంగే చంద్రశేఖర్ రెడ్డి, వేముల చిన్నంకిరెడ్డి, వేముల మాజీ ఎంపీపీ రాజగోపాల్ రెడ్డి, మాబు షరీఫ్, తక్కెళ్ళ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి పోటీలకు ట్రిపుల్ ఐటీ విద్యార్థుల బృందాల ఎంపిక



**వేంపల్లె మన జనప్రగతి సెప్టెంబర్ 18:**–
జాతీయస్థాయి బిజినెస్ క్విజ్ ఫైనల్ పోటీలకు ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ కి చెందిన శ్రీ చక్రా రెడ్డి, శ్రీజా రెడ్డి విద్యార్థుల బృందాలు ఎంపికయ్యాయి.మధ్యప్రదేశ్ రాష్ట్రం ఐఐమ్ ఇండోర్ ఆధ్వర్యంలో అత్తరవ్ రన్ భూమి -2026లో భాగంగా నిర్వహిస్తున్న ప్రజ్ఞ ది బిజినెస్ క్విజ్ కాంపిటీషన్ జాతీయ స్థాయి ఫైనల్స్ ఈ విద్యార్థుల బృందాలు పాల్గొన నున్నాయి.దేశవ్యాప్తంగా వివిధ కళాశాలలకు చెందిన వందలాది బృందాలు ఈ పోటీలో పాల్గొనగా, ఈ కార్యక్రమం కోసం 500కు పైగా బృందాలు నమోదు చేసుకున్నాయి. ప్రాథమిక దశ పోటీ అనంతరం, ఆర్జీయూకేటీ ఆర్కే వ్యాలీ కి చెందిన బృందం జాతీయ స్థాయి ఫైనల్స్‌కు ఎంపికైన బృందాల్లో స్థానం సంపాదించింది.జాతీయ స్థాయి ఆఫ్‌లైన్ ఫైనల్స్ 2026 అక్టోబర్ 30 నుంచి నవంబర్ 1 వరకు ఐఐఎం ఇండోర్ భారతీయ మేనేజ్‌మెంట్ సంస్థలో నిర్వహించనున్నారు. తమ కళాశాల టీం 7 విద్యార్థులకు జాతీయస్థాయి పోటీలలో పాల్గొనే అవకాశం లభించడం పట్ల ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటి డైరెక్టర్ ప్రొఫెసర్ విజయ ప్రకాశ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డా.పీ.రవి కుమార్, డీన్ ఆఫ్ అకడమిక్స్ రమేష్ కైలాష్, డాక్టర్ కోనప్ప, డాక్టర్ భాస్కరయ్య హర్షం వ్యక్తం చేశారు.

## సర్వసభ్య సమావేశం.. సమగ్ర నివేదికలు తప్పనిసరి


- అన్ని శాఖల అధికారులకు ఎంపీపీ సూచన
- ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభం
- మండల సమస్యలపై విస్తృత చర్చ



**వేముల మన జనప్రగతి సెప్టెంబర్ 18:**–"మండల సర్వసభ్య సమావేశానికి అన్ని శాఖల అధికారులు సమగ్ర నివేదికలతో హాజరు కావాలి" అని వేముల మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు చల్లా గంగాదేవి వెంకటనారాయణ అన్నారు. శనివారం ఉదయం 10.30 గంటలకు వేముల మండల పరిషత్ కార్యాలయ సభా భవనంలో సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు.శుక్రవారం ఆమె ఒక ప్రకటన ద్వారా మాట్లాడుతూ..మండలంలోని అన్ని శాఖల అధికారులు తమ శాఖలకు సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందుతున్న సేవలు, పెండింగ్ పనులు, పరిష్కరించాల్సిన సమస్యల వివరాలతో కూడిన సమగ్ర నివేదికలను సిద్ధం చేసుకుని సమావేశానికి హాజరు కావాలని సూచించారు. సమావేశంలో మండల అభివృద్ధి, ప్రజా సమస్యలు, వివిధ శాఖల పనితీరుపై విస్తృతంగా చర్చించనున్నట్లు తెలిపారు.జెడ్పీటీసీ కోకటం వెంకట బయపు రెడ్డి, ప్రత్యేక అధికారులు, ఎంపీటీసీలు, కోఆప్షన్ సభ్యులు సమావేశానికి తప్పక హాజరై తమ పరిధిలోని సమస్యలను సభ దృష్టికి తీసుకురావాలని కోరారు. అధికారులు నిర్ణీత సమయానికి సమావేశానికి చేరుకుని సమయపాలన పాటించాలని స్పష్టం చేశారు.సమావేశం అనంతరం సభ్యులు, అధికారులు, సిబ్బందికి తన సొంత నిధులతో భోజన ఏర్పాట్లు చేసినట్లు ఎంపీపీ చల్లా గంగాదేవి వెంకటనారాయణ తెలిపారు.

## బొమ్మనహాల్ మండలంలో ఉపాధి హామీ గ్రామ సభల షెడ్యూల్ విడుదల

- 19వ విడత పనులపై గ్రామసభలు



**బొమ్మనహాల్ మన జనప్రగతి సెప్టెంబర్ 18:**–బొమ్మనహాల్ మండల పరిధిలోని ఉపాధి హామీ పథకం (ఎంజిఎన్ఆర్ఇజిఎస్) పనులపై 19వ విడత సామాజిక తనిఖీలో భాగంగా అన్ని గ్రామస్థాయిలో గ్రామసభలు నిర్వహించేందుకు మండల ఏపిఓ లక్ష్మీకాంత బాయ్ శుక్రవారం షెడ్యూల్ విడుదల చేశారు,ఈ సందర్భంగా ఏపీఓ లక్ష్మీకాంతం బాయ్ మాట్లాడుతూ..ప్రస్తుత నెల సెప్టెంబర్ 18 నుంచి అక్టోబర్ 10 వరకు అన్ని గ్రామాలలో సామాజిక తనిఖీ ప్రక్రియ కొనసాగనుంది,సామాజిక తనిఖీలో భాగంగా బొమ్మనహాల్ 8,గోనేహాల్ 23,సింగనహళ్లి 29, ఏలంజి 29,కొలగానహళ్లి 03, లింగదహాల్ 24,ఉద్దేహాల్ 10, హరేసముద్రం 10,కురువల్లి 06, నెమకల్లు 25,సిద్ధరాంపురం 30, బొల్లనగుడం 24,గోవిందవాడ 06,కల్లుహోళ్ల 29,ఉంతకల్ 10, బండూరు 05,డి.హొన్నూరు 10, ఉప్పరహాల్ 29,శ్రీధరఘట్ట 24,తేదీలలో అన్ని పంచాయతీ కార్యాలయాలలో,గ్రామ సచివాలయాలలో,రచ్చకట్టలు, పాఠశాలలు,దేవాలయాల వద్ద నిర్ణీత తేదీల్లో గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు, చివరిగా మండల స్థాయి ప్రజావేదిక అక్టోబర్ 13న బొమ్మనహాల్ ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించనున్నట్లు తెలిపారు, గ్రామసభలకు ప్రజలు హాజరై సామాజిక తనిఖీ ప్రక్రియలో భాగస్వాములు కావాలని,ఏపీఓ లక్ష్మీకాంత బాయ్ కోరారు.

మనజనప్రగతి

19 - 09 - 2026

# మున్సిపల్ రంగ ప్రైవేటీకరణను వెంటనే ఉపసంహరించాలి

**• హైకోర్టు ఆదేశాల మేరకు కార్మికులను పర్మినెంట్ చేయాలి**




**అన్నమయ్య జిల్లా బ్యూరో మన జనప్రగతి సెప్టెంబర్ 18:**–ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షులు బీవీ రమణ, జిల్లా గౌరవ అధ్యక్షులు ఎ. రామాంజులు మాట్లాడుతూ స్వచ్ఛ నగరాలు కార్మికుల శ్రమతోనే సాధ్యమవుతున్నాయని అన్నారు. నగరాలను పరిశుభ్రంగా ఉంచుతున్న మున్సిపల్ కార్మికులకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత లేకపోవడం దారుణమన్నారు. మున్సిపల్ రంగాన్ని ప్రైవేట్ సంస్థలకు అప్పగించే ప్రయత్నాలను ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు.పారిశుద్ధ్యం, వీధి దీపాలు, నీటి సరఫరా వంటి ప్రజా సేవలను ప్రైవేట్ కాంట్రాక్టర్లకు అప్పగిస్తే కార్మికులు ఉపాధి కోల్పోవడంతో పాటు ప్రజలపై అదనపు భారం పడే అవకాశం ఉందన్నారు. మున్సిపల్ రంగంలో ప్రైవేటీకరణ విధానాలను వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. సంవత్సరాలుగా కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న కార్మికులను హైకోర్టు ఆదేశాల మేరకు పర్మినెంట్ చేసి, సమాన పనికి సమాన వేతనం, పీఎఫ్, ఈఎస్ఐ, గ్రాట్యుటీ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.స్ట్రీట్ లైటింగ్ విభాగంలో టెండర్ ప్రక్రియను నిలిపివేయాలని కోరారు. ఇప్పటికే అనుభవంతో పనిచేస్తున్న కార్మికులను తొలగించి కొత్త టెండర్లకు వెళ్లే విధానాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని అన్నారు. తమ డిమాండ్లపై ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే జిల్లా వ్యాప్తంగా సమ్మెతో పాటు పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా నాయకులు అక్బర్, శ్రీనివాసులు, రమణ, దేవా, ఇంజినీరింగ్ కార్మికులు, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

# శ్రీవారి గరుడసేవకు శ్రీవిల్లిపుత్తూరు గోదాదేవి మాలలు





**తిరుమల మన జనప్రగతి సెప్టెంబర్ 18:**–తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో అత్యంత విశిష్టమైన గరుడసేవ సందర్భంగా శ్రీమలయప్పస్వామివారికి అలంకరించేందుకు తమిళనాడులోని శ్రీవిల్లిపుత్తూరు నుంచి గోదాదేవి మాలలు శుక్రవారం తిరుమలకు చేరుకున్నాయి.ముందుగా ఈ మాలలను తిరుమలలోని శ్రీ బేడి ఆంజనేయస్వామివారి ఆలయం వద్దనున్న శ్రీ పెద్దజీయర్ మఠానికి తీసుకువచ్చారు. శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్ స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్ స్వామి ఆధ్వర్యంలో మాలలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మంగళవాయిద్యాల నడుమ మాడవీధుల గుండా ఊరేగింపుగా శ్రీవారి ఆలయానికి తీసుకెళ్లారు.**గోదాదేవి మాలలకు విశిష్ట ఆధ్యాత్మిక ప్రాశస్త్యం.**శ్రీవిల్లిపుత్తూరులో గోదాదేవికి అలంకరించిన పుష్పమాలను గరుడసేవ రోజున శ్రీవారికి అలంకరించడం అనాదిగా వస్తున్న సంప్రదాయం.పురాణ కథనాల ప్రకారం, శ్రీరంగమన్నార్ స్వామివారికి పుష్పకైంకర్యం చేసిన శ్రీ పెరియాళ్వార్ కుమార్తె గోదాదేవి, స్వామివారిపై అపారమైన భక్తితో పుష్పమాలను ముందుగా తాను ధరించి, అనంతరం స్వామివారికి సమర్పించేవారు. గోదాదేవి భక్తిని గుర్తించిన శ్రీరంగనాథుడు, ఆమె ధరించిన మాలలనే స్వీకరించారని భక్తుల విశ్వాసం. గోదాదేవిని శ్రీవారి దేవేరి అయిన భూదేవి అవతారంగా భావిస్తారు.ఈ పవిత్ర సంప్రదాయం గరుడసేవకు మరింత ఆధ్యాత్మిక శోభను చేకూర్చుతోంది.ఈ కార్యక్రమంలో టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరి, శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవో భాస్కర్, శ్రీవిల్లిపుత్తూరు ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

# చిట్వేలిలో వైభవంగా వినాయక నిమజ్జనాలు

**చిట్వేలి మన జనప్రగతి సెప్టెంబర్ 18:**–చిట్వేలి మండలంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. వినాయక చవితి ప్రారంభమైన ఐదో రోజున పలు ప్రాంతాల్లో వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమాలను భక్తులు వైభవంగా నిర్వహిస్తున్నారు. నిమజ్జనానికి తరలివెళ్లే భక్తుల కోసం ఆయా వినాయక మండపాల వద్ద నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. దీంతో మండపాల వద్ద సందడి నెలకొంది. కె.ఎస్. అగ్రహారంలో అలిశెట్టి పెంచలయ్య ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. చిట్వేలి ప్రధాన రహదారిలో క్రేజీ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద సుమారు వెయ్యి మందికి అన్నదానం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఐదవ రోజు మండల వ్యాప్తంగా మొత్తం 36 వినాయక విగ్రహాలను నిమజ్జనం చేయనున్నట్లు చిట్వేలి పోలీస్ సబ్‌ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా జరిగేలా పోలీసు శాఖ ఆధ్వర్యంలో భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు పేర్కొన్నారు. భక్తులు నిమజ్జన కార్యక్రమాల్లో పోలీసులకు సహకరించి, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించాలని ఆయన సూచించారు.



# ఐదేళ్లు ఏం చేశారు? ఇప్పుడు పోలవరంపై నీతులు చెబుతారా?

**పులివెందుల నియోజకవర్గం టీడీపీ ఇంచార్జ్ బీటెక్ రవి**

**మాజీ సీఎం జగన్ తీరుపై బీటెక్ రవి తీవ్ర ఆగ్రహం**

**పోలవరం ఎత్తు తగ్గింపునకు లేఖలు రాసింది స్వయంగా జగనేనని ఆరోపణ**

**రాయలసీమ ప్రాజెక్టులపై అవగాహన లేకుండా రైతులను రెచ్చగొడుతున్నారని మండిపాటు**

**ఎంపీ అవినాష్ రెడ్డి అనుచరుడిపై ఉన్న హత్య కేసుపై 'సిట్' విచారణకు డిమాండ్**




**పులివెందుల అర్బన్ మన జనప్రగతి సెప్టెంబర్ 18:** ఐదేళ్ల పాలనలో ప్రాజెక్టులను గాలికొదిలేసి,ఇప్పుడు పోలవరంపై నీతులు చెప్పడం మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని టీడీపీ ఎమ్మెల్సీ బీటెక్ రవి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. జగన్ నిర్వహించిన మీడియా సమావేశంపై స్పందిస్తూ వాస్తవాలను వక్రీకరిస్తూ కూటమి ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.పోలవరం ప్రాజెక్టు పూర్తి ఎత్తు 45.72 మీటర్లు కాగా,దానిని 41.15 మీటర్లకే పరిమితం చేయాలని కేంద్ర పోలవరం అథారిటీకి స్వయంగా లేఖ రాసింది జగన్మోహన్ రెడ్డేనని బీటెక్ రవి స్పష్టం చేశారు.ఇందుకు సంబంధించిన అధికారిక పత్రాలు,ఆధారాలు తమ వద్ద ఉన్నాయని తెలిపారు.ఐదేళ్ల వైసీపీ పాలనలో పోలవరం పనులు కేవలం 2 నుంచి 3 శాతం మాత్రమే జరిగాయని ఎద్దేవా చేశారు.ప్రాజెక్టు సామర్థ్యాన్ని తగ్గించి,రూ. 30 వేల కోట్ల కేంద్ర నిధులు ఆగిపోయేలా చేసిందే జగన్ అని ఆరోపించారు.చంద్రబాబు నాయుడు ఉత్తరాంధ్రకు నీరివ్వడం,వెలుగొండను ప్రారంభించడం చూసి ఓర్వలేకే ఈ తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.రాయలసీమ జలాలపై తప్పుడు రాజకీయాలుకృష్ణా నదీ యాజమాన్య బోర్డు నిబంధనలపై కనీస అవగాహన లేకుండా జగన్ మాట్లాడుతున్నారని బీటెక్ రవి దుయ్యబట్టారు.పోతిరెడ్డిపాడు నికర జలాలపై కాకుండా మిగులు జలాల ఆధారంగా వరద వచ్చినప్పుడు మాత్రమే నడుస్తుందనే సంగతి జగన్‌కు తెలియదా అని ప్రశ్నించారు.చిత్రావతి రిజర్వాయర్‌లో ప్రస్తుతం 3.4 టీఎంసీల నీరు మాత్రమే ఉందని తాగునీటి అవసరాలకే 3.9 టీఎంసీలు అవసరమని అధికారిక లెక్కలు చెబుతున్నాయన్నారు.నీటి కేటాయింపుల్లో మొదటి ప్రాధాన్యత తాగునీటికే ఇవ్వాల్సి ఉంటుందని, రాజకీయ ప్రయోజనాల కోసం రైతులను జలదీక్షల పేరుతో రెచ్చగొట్టడం మానుకోవాలని హితవు పలికారు.కడప ఎంపీ అవినాష్ రెడ్డి పీఏ రాఘవరెడ్డి వ్యవహారాలపై ఇప్పటికే జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశామని ఈ వ్యవహారాన్ని సీఎం దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు రవి తెలిపారు.అంబకపల్లెకు చెందిన పక్కీరారెడ్డి మిస్సింగ్,అనుమానాస్పద మృతి కేసులో డీఎన్ఏ పరీక్షలను సైతం తారుమారు చేశారని ఆరోపిస్తూ,సమగ్ర నిజాలు బయటకు రావాలంటే ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు విచారణ చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరుతామని తెలిపారు.'ఒక దెబ్బ పడితే నాలుగు దెబ్బలు కొడతాం' అంటూ ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీటెక్ రవి స్పందించారు.ఆయన మాట్లాడుతూ రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుంచి వారు చేసిన తప్పులను బట్టి తాము కూడా అదే విధంగా స్పందిస్తే జీవితకాలం కొట్టుకునే పనే ఉంటుందని అన్నారు.తమను 'దండుపాళ్యం బ్యాచ్' అంటూ విమర్శించడం సరికాదని,గతంలో అలా వ్యవహరించిన వారి బ్యాచ్‌లు ఏమైనా రాజకీయాల నుంచి రిటైర్ అయ్యాయా? అని ప్రశ్నించారు.గతంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో సింహాద్రిపురంలో నామినేషన్ పత్రాలు చించివేసి, బెదిరింపులతో బలవంతపు ఏకగ్రీవాలు చేసుకున్న చరిత్ర వైసీపీదని బీటెక్ రవి విమర్శించారు.రాబోయే పులివెందుల మున్సిపాలిటీ ఎన్నికల్లో ప్రజాస్వామ్య బద్ధంగా పోటీ చేస్తామని,ఇప్పటికే టీడీపీ అభ్యర్థి ఎంపిక పూర్తయిందని వెల్లడించారు. ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని సమస్యలకు ముగింపు పలికేందుకు పులివెందుల ప్రజలు ఈసారి తెలుగుదేశం పార్టీకి ఒక్క అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

# కరువు నుంచి అన్నదాతలను కాపాడాలి

**ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి**



**అన్నమయ్య జిల్లా బ్యూరో మన జనప్రగతి సెప్టెంబర్ 18:**–అకాల, వర్షాల లేమితో పంటలు ఎండిపోతున్న నేపథ్యంలో అన్నమయ్య జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.శుక్రవారం గాలివీడు మండలంలోని గోరాం చెరువు గ్రామం, పెద్దపల్లి పరిధిలో ఆయన పర్యటించి టమోటో, వేరుశనగ పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఓ రైతు రెండు ఎకరాల్లో సాగు చేసిన వేరుశనగ పంట కాయకు గింజపట్టే సమయంలో నీరు అందక ఎండిపోతున్న పరిస్థితిని పరిశీలించారు. ఖరీఫ్ సీజన్‌పై ఆశతో అరకొరగా కురిసిన వర్షాలకు రైతులు పంటలు సాగుచేసినప్పటికి ఆ తర్వాత వర్షాలు లేకపోవడంతో బావులు, బోర్లలో నీరు అడుగంటిపోయిందని రైతులు రంగారెడ్డికి వివరించారు.మండలంలోని పలు ప్రాంతాల్లో టమోటా, వేరుశనగ, వరి తదితర పంటలు నీటి కొరతతో ఎండిపోతున్నాయని, మరికొన్ని పంటలు నేలకు ఒరిగే పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులతో ముఖాముఖి సమావేశం నిర్వహించిన రంగారెడ్డి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం ఆయన మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితులతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. పంటల సాగు కోసం రైతులు అప్పులుచేసి పెట్టుబడులుపెట్టినప్పటికి దిగుబడి లేకపోవడంతో పెట్టుబడి కూడా తిరిగి వచ్చే పరిస్థితి లేదన్నారు. గిట్టుబాటు ధరలు లేకపోవడం, పంట నష్టాలు, అప్పుల భారం కారణంగా రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.అన్నమయ్య జిల్లాను వెంటనే కరువు జిల్లాగా ప్రకటించి ప్రత్యేక కరువుప్యాకేజీని అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వర్షాభావం, ఇతర ప్రకృతి పరిస్థితుల వల్ల నష్టపోయిన పంటలను గుర్తించి రైతులకు ఇన్‌పుట్ సబ్సిడి, పంటల బీమా పరిహారం అందించాలని కోరారు. రైతులు తీసుకున్న రుణాలకు ఉపశమనం కల్పించడంతో పాటు తిరిగి పంటల సాగుకు కొత్త రుణాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.రైతులను ఆర్థిక సంక్షోభం నుంచి బయటపడేలా చర్యలు తీసుకోవడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యత అని రంగారెడ్డి అన్నారు. రైతుల పంట నష్టాలను వెంటనే అంచనా వేసి తగిన పరిహారం అందించాలని ఆయన కోరారు.

# ట్రిపుల్ ఐటీల కాంట్రాక్ట్ టీచింగ్ ఫ్యాకల్టీకి మినిమం టైం స్కేల్

**ప్రభుత్వ జీవో జారీ**

**8 ఏళ్ల పోరాటం ఫలించింది**

**త్వరలో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ చిత్రపటాలకు పాలాభిషేకం**

**కాంట్రాక్ట్ ఫ్యాకల్టీ అధ్యక్షుడు నజీర్ హుస్సేన్**



**వేంపల్లె మన జనప్రగతి సెప్టెంబర్ 18:**–రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్జీయూకేటీ ) పరిధిలోని ఇడుపులపాయ, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలలో పనిచేస్తున్న కాంటాక్ట్ టీచింగ్ ఫ్యాకల్టీలకు మినిమం టైం స్కేల్ మంజూరు చేస్తూ రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి శ్యామల రావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు ప్రభుత్వ జీవో 263 జారీ చేశారు. ఈ 4 ట్రిపుల్ఐటీలలో 2018 నుంచి 26 మంది కాంట్రాక్ట్ టీచింగ్ ఫ్యాకల్టీ లుగా పని చేస్తున్నారు . వీరికి నెల కు రూ 33 వేల వేతనం ఇస్తున్నారు. అయితే ఈ వేతనం తమకు సరిపోవటం లేదని తమకు మినిమం టైం స్కేల్ మంజూరు చేయాలని కాంట్రాక్టు టీచింగ్ ఫ్యాకల్టీ అసోసియేషన్ తరపున ఫ్యాకల్టీలు గడచిన 8 ఏళ్లుగా పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తున్నారు. ఆయా ట్రిపుల్ ఐటీలలో ఆందోళనల తో పాటు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, ఇతర మంత్రులను కలిసి తమ వేదన ను వినిపించారు. ఆనక హైకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు ఆయా ట్రిపుల్ ఐటీలలో పని చేస్తున్న 26 మంది కాంట్రాక్టు టీచింగ్ ఫ్యాకల్టీ కి రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు మినిమం టైం స్కేల్ మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు వెలువరించింది. దీంతో ఒక్కో టీచింగ్ కాంట్రాక్ట్ ఫ్యాకల్టీ నెల జీతం రూ 70 వేలకు పెరగనుంది. రాష్ట్ర హైకోర్టు అడ్వకేట్ లు దేవల్ రాజు, అనిల్ కుమార్ ల కృషి ఎంతో ఉందని సదరు ఫ్యాకల్టీ అసోసియేషన్ అధ్యక్షుడు నజీర్ హుస్సేన్ పేర్కొన్నారు. 8 ఏళ్ల పోరాటం ఫోటోని ప్రభుత్వ హయాంలో ఫలించిందన్నారు. ఈ విషయంలో తమకు సహకరించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్, ఇతర మంత్రులు నాయకులు అధికారులు తోటి ఉద్యోగులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తమకు పెరిగిన నెల జీతం అకౌంట్లలో జమ అయిన వెంటనే ఇడుపులపాయలో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తానని చేస్తామని నజీర్ హుస్సేన్ స్పష్టం చేశారు.

PRINTER, PUBLISHER AND OWNED BY **YADATI VIVEKANANDA REDDY YADAV**, AND PRINTED AT M/S GOKUL PUBLICATIONS, # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), PUBLISHED AT # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), Editor : YADATI VIVEKANANDA REDDY YADAV, E-Mail :manajanapragathi@gmail.com, Cell : 8125555507 RNI No : - APTEL/2021/80174